ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 28 సంచిక : 1 సెప్టెంబర్ 2022

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 32

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥ 150/-

విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో. . . .

శ్రీ నాన్నగారు - ప్రేమ వాహిని ........................................ 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 5

అక్షరమణమాల ........................................................ 28

భగవద్గీత ................................................................ 30

ఇతర విషయములు :

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



సద్గురు దేవ సద్గురు దేవ సద్గురు దేవ పాహిమామ్।

నాన్నగారు నాన్నగారు నాన్నగారు రక్షమామ్॥



# శ్రీ నాన్నగారు - ప్రేమవాహిని

శ్రీ నాన్నగారు విశాఖపట్నంలో ఒక భక్తసమావేశంలో ఉండగా కొందరు విలేకరుల ప్రశ్నలకు సమాధానాలు చెపుతూ, భక్తులపట్ల ఆయనకున్న ప్రేమ, భక్తులకు ఆయనకు మధ్య ఉన్న అనుబంధం, స్వయంగా ఆయనే వివరించారు. 1993లో జరిగిన ఈ సమావేశంలో శ్రీ నాన్నగారు చెప్పిన మాటలు, దేహంతో సంబంధం లేకుండా భక్తులని అనంతంగా అనుగ్రహిస్తారని, ఆ ప్రేమవాహిని కొనసాగుతూనే ఉంటుందనే భక్తుల విశ్వాసాన్ని బలపరుస్తాయి. ఆ సందర్భంగా విశాఖపట్నం భక్తులు ముద్రించిన పుస్తకము నుంచి ఆయన ప్రేమని సందేశాన్ని తెలిపే ఆయన స్వయంగా చెప్పిన మాటలు, శ్రీ నాన్నగారి జన్మదిన సందర్భంలో మననం చేసుకుందాము.

**భక్తులతో అనుబంధం:**

నేను శ్రోతలను అమితంగా ప్రేమిస్తాను. నేను వారిపట్ల ఉదారబుద్ధితో వ్యవహరిస్తాను. శాంతితో మెలుగుతాను. వారిలో సామాన్యమైన లోపాలను పట్టించుకోను. వారికి ఆత్మవిద్యను బోధించటంతో సరిపెట్టుకోకుండా, వారి భౌతిక అభివృద్ధిని కూడా కాంక్షిస్తాను. వారిలో ఉన్న మంచితనమును మేలుకొలుపుటకు సహకరిస్తాను. వారు శాంతి మార్గంలో నడిచి శాంతిస్థానము పొందుటకు నావంతు కృషి చేస్తాను. నా పట్ల భక్తుల విశ్వాసము కూడ సజీవముగానే ఉంటున్నది. నేను భక్తులను నా మిత్రులుగానే చూస్తాను. కాని వారు నన్ను దైవసమానంగా చూస్తారు. అందువలన వారిని గురించి ఆలోచించటంలో కాని,

వారికి బోధించుటలో కాని జాగ్రతపడతాను. ఏనాడు కూడా వారిపట్ల బాధ్యతారహితంగా ప్రవర్తించలేదు. నా అర్హతకు మించిన గౌరవాన్ని వారు నాపట్ల చూపిస్తున్నారు అనిపిస్తుంది. వారు ఏదైనా పొరపాటు చేస్తే, అది నేను చేసినట్లుగానే భావిస్తాను. ఏదో ఒక స్థాయిలో, వారి బాధలో నేనూ భాగం పంచుకుంటాను. ఆలోచనే కేంద్రంగా పెట్టుకొని జీవించుటకు నా బోధలు వారికి కొంతవరకు సహకరిస్తాయి. నాకు, భక్తులకు వున్న సంబంధము గురుశిష్య సంబంధము లాంటిది కాదు. ఒకే కుటుంబ సభ్యులవలె మెలుగుతాము. భక్తులు తమ జీవిత పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా వారికి నాతోటి ఉన్న ప్రేమానుబంధము మాత్రము ఎన్నడూ తెగలేదు. మానసికమైన అనుబంధము ఉంటూనే ఉన్నది. దైనందిన జీవితంలో వారి సమస్యలకు నేను చెప్పే మాటలలో సమాధానాలు దొరుకుతాయి. నా మాటలు వినటం వల్ల వారికి శాంతి కలుగుతుంది. శాంతిలేని వాడికి సుఖం లేదు. నా ప్రవచనాలవల్ల వారికి సుఖం కలుగుతుంది. నా ద్వారా వారి పట్ల ప్రవహిస్తున్న ప్రేమ, కరుణ, ఆప్యాయత, ఆదరణ, అనురాగము వారికి శాంతి సాగరములో ఈదుతున్నట్లుగా అనిపిస్తుంది. భక్తుల పట్ల నాకున్న అభిమానమును వారుకూడా గుర్తిస్తున్నట్లు నాకు అవగాహన అవుతున్నది. అందుచేత నేనుకూడా బోధించకుండా ఉండలేకపోతున్నాను. క్లిష్టమైన విషయమును తేలికైన మాటలతో విశదపరచుటకు ప్రయత్నిస్తాను. నేను చెప్పిన విషయము వారికి అందకపోతే అది నా లోపముగానే పరిగణిస్తాను. భక్తులు నా పట్ల చూపిస్తున్న ఆదరణ, విశ్వాసము తెంపు లేకుండా ఉన్నది. అందువలన నా శరీరం మరణించినా నేను వారి హృదయాలలో జీవించే ఉంటాను. దుఃఖము లేని స్థాయికి వారిని తీసుకు వెళ్ళుటకు తత్త్వము గురించి చిన్న చిన్న మాటలతో, పొట్టి పొట్టి వాక్యములతో వారికి ఉపదేశించుటకు ప్రయత్నిస్తాను.

**భక్తులకు సందేశము:**

స్వార్థము తగ్గించుకొని పని చేయాలి. అందరి క్షేమంలోనే మన క్షేమం కూడా ఇమిడి ఉందని మరువకూడదు. స్వతంత్రముగా ఆలోచించటం నేర్చుకోవాలి. ఎంతోకొంత బుద్ధి లేకుండా మానవుడు ఉండడు. బుద్ధికి సోమరితనం అలవాటు చేయకూడదు. ఆలోచనలో కూడా అమృతం ఉంది. ఆలోచించి మాట్లాడటం వలన, ఆలోచించి పని చేయటం వలన, అనేక కష్టములను అతిక్రమించవచ్చు. బుద్ధికి సత్యవస్తువు దర్శనమిస్తేనే

కాని అది నిర్మలము అవ్వదు. మన బుద్ధిని మనము బాగుచేసుకోకపోతే ఎవరు బాగుచేసి పెడతారు? మానవాళిని విద్యావంతులను చేయటంలో మనవంతు కృషి మనం చేయాలి. ఆరోగ్య సూత్రాలను మనం పాటించాలి. ఇతరులచేత పాటింప చేయాలి. పూర్వం కంటే ఈనాడు మనస్సు మీద సమాజపరంగా వచ్చే ఒత్తిడులు ఎక్కువ అయినవి. అందువలన మానసికమైన ఆరోగ్యం లోపిస్తున్నది. తినటానికి తిండి ఎంత అవసరమో, బ్రతకటానికి నీడ ఎంత అవసరమో, సుఖంగా ఉండటానికి మనశ్శాంతి కూడా అంతే అవసరము. మన మాటల ద్వారా, చేతల ద్వారా, తోటి మానవుడిని శాంతి మార్గంలో ప్రవేశపెట్టి సుఖము చేకూర్చాలి. వ్యర్థమైన కర్మలతో వ్యర్థమైన ఊహలతో మన కాలమును పాడుచేసుకోకూడదు. పని యందు గౌరవము పెంచాలి. పని చేస్తూ శాంతి స్థానమును సంపాదించాలి. పనిలో దేవుడిని చూడటం నేర్చుకోవాలి. పని ద్వారా కూడా భగవంతుడిని ఆరాధించటం నేర్చుకోవాలి. పనికి జ్ఞానమునకు విరోధం లేదు. విద్య యొక్క, శాంతి యొక్క ప్రాముఖ్యతను మానవుడికి తెలియచెప్పి వాటిని సముపార్జించుకొనుటకు అనుకూలముగా ప్రోత్సహించాలి. భౌతికాభివృద్ధి ఎంత ముఖ్యమో, ఆధ్యాత్మిక వికాసం కూడా అంతే ముఖ్యము. ఓర్పును నేర్చుకోవాలి. సమానబుద్ధి సాధించాలి. సహనము బుద్ధి యొక్క లోతులను పెంచి, హృదయమును విశాల పరుస్తుంది. పని, విద్య ఇవి రెండూ రెండు నేత్రాల వంటివి. అందువలన వీటిపట్ల అజాగ్రత్త పనికిరాదు. మంచం పట్టి మరణించటం కంటే పని చేస్తూ మరణించటం ఉత్తమమైనది. పని చేస్తూ పని లేని స్థితికి ఎదగాలి, కొంతమంది వారి పొట్టకే పరిమితమౌతారు. కొంతమంది ఇతరుల కోసమే జీవించటానికి పుడతారు. దేశభక్తి ఎంత ముఖ్యమో దైవభక్తి కూడా అంతే ముఖ్యము. మానవుడికి సామాజిక స్పృహ కలుగ చేయుటకు మనం శక్తి వంచన లేకుండా కృషి చేయాలి. మాటకి పనికి తలంపు ఆధారం. అందువలన తలంపులను నియమించుకోవాలి. తనకు కాని, సమాజమునకు కాని పనికిరాని విషయములను ఆలోచిస్తూ కూర్చుంటే అజ్ఞానము పెరుగుతుంది. దుఃఖము లేని స్థితిని పొందుటకు అజ్ఞానమును నిర్మూలించాలి. సర్వ అనర్థములకు అజ్ఞానమే కారణము. పేదరికం కంటే అజ్ఞానము భయంకరమైనది. సంపద సృష్టించుట ద్వారా పేదరికమును, జ్ఞానమును సముపార్జించుట ద్వారా అజ్ఞానమును తొలిగించవచ్చును. జ్ఞానమే మోక్షము, జ్ఞానము లేని జీవితము వ్యర్థము.

**ఓం శ్రీ నాన్న పరమాత్మనే నమః**

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 04 నవంబరు 1990, మారుటేరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

జ్ఞానం అనేది ఉందా? ఆత్మ వైభవం అనేది ఉందా? అంటే దానికి పుస్తకాలు చదవక్కరలేదు, గౌతమ బుద్ధుడి నేత్రాలను చూస్తే తెలుస్తుంది. గౌతమ బుద్ధుడు నేత్రాలలోకి మనం చూస్తే, సత్యం ఒకటి ఉందని, పరమార్థం ఒకటి ఉందని, ఆత్మతత్త్వం ఒకటి ఉందని మనకు అర్థం అవుతుంది. దానికి ప్రత్యేకంగా ఋజువులు, సాక్ష్యాలు ఏమీ అక్కర్లేదు. బుద్ధుడు ప్రశాంతమైన హృదయం కలవాడు. లోతైన హృదయం కలవాడు. సువిశాలమైన మనస్సు కలవాడు. అందుకే దశావతారాలలో ఆయన పేరు కూడా వచ్చింది. ఒక మతాన్ని స్థాపించటం అనేది సామాన్యులకి సాధ్యం కాదు. ఆ మత స్థాపకుడు ఎంతో పవిత్రుడు అయి ఉండాలి. ఎంతో మేధావి అయి ఉండాలి. సంఘం పట్ల అంటే సమాజంలోని మనుషుల పట్ల అపూర్వమైన, ఉదాత్తమైన, లోతైన ప్రేమ ఉండాలి. అర్హత లేకుండా స్థాపించటానికి పూనుకొంటే కాల ప్రవాహంలో కొట్టుకుపోతుంది. యేసు క్రీస్తు, గౌతమ బుద్ధుడు, మహమ్మద్ వాళ్ళు మతాలు స్థాపించగలిగారు అంటే కేవలం వాళ్ళ హృదయం యొక్క లోతు వాళ్ళ యొక్క విశాలత్వమే కారణం. సముద్రపు నీరు మీరు ఎక్కడ చూసినా ఉప్పగా ఎలా ఉంటుందో, నేను ఏది మాట్లాడినా ఆ మాట మిమ్మల్ని మోక్షానికి తీసుకు వెళుతుంది అన్నాడు బుద్ధుడు. అంటే నీ గురిని మోక్షానికి చూపిస్తుంది. ఎక్కడా మధ్యలో ఆపదు. చిల్లర గొడవల మీదకి మీ మనస్సును చిందించకండి. ఏ మాట ఆయన నోటి వెంట వచ్చినప్పటికీ, దాని గమ్యం మోక్షమే. మీ మనస్సును మోక్షం వైపుకి తీసుకు వెళ్ళటం కోసమే బుద్ధుడు మాట్లాడేవాడు. సముద్రంలోని నీటిలో ఉప్పు ఎలా అంతర్భాగం అయి ఉంటుందో, నేను మాట్లాడే ప్రతీ మాటలో కూడా మోక్షతత్వం ఉంటుంది, ఆత్మతత్వం ఉంటుంది. మిమ్మల్ని మోక్షానికి తీసుకు పోతుంది అన్నాడు బుద్ధుడు. బుద్ధుడు అమృతతుల్యుడు. ఆయన వాక్కులు అమృత వాక్కులే. అవి చిలక పలుకులు కాదు. మానవజాతిని అంత

అపురూపంగా, ఒక్క మానవ జాతినే కాదు పశు పక్షులని, మొత్తం సృష్టిని అంతా కూడా అంత అద్భుతంగా ప్రేమించిన వ్యక్తి మనకి ఎక్కడా కనిపించడు. అంత జాలి, కరుణ, ఉన్న హృదయం మనకి ఎక్కడా కనిపించదు. గౌతమ బుద్ధుడి ప్రేమ సృష్టిలో ప్రతి అణువు అణువుకి, ప్రతీ క్రిమి కీటకాలకి కూడా అందింది. ఆయన ప్రేమ అపారం, ఆయన కరుణామయుడు. కరుణ అనే గుణం ఏ మనిషిలో అయితే ఉందో, ఆ మనిషి పిలవకుండానే అన్ని సుగుణాలు వచ్చేస్తాయి. ఒక్క సుగుణం, ఏది? Compassion. ఈ కరుణ అనే గుణం ఎవరిలో అయితే ఉందో, మిగతా సుగుణాలు అన్నీ కూడా మీరు పిలవకుండా, వాటంతట అవి వచ్చి మీ హృదయంలో ప్రవేశిస్తాయి. ఈ కరుణ అనే గుణానికి అంత గొప్ప శక్తి ఉంది. మిగతా సద్గుణాలని, సుగుణాలని ఆహ్వానించి, తనలో ఇముడ్చుకునే శక్తి ఉంది. నిజమైన ధర్మం కరుణే. కరుణకు మించిన ధర్మం లేదు. తన ప్రసంగ ధోరణిని మార్చాడు బుద్ధుడు. తన నిర్వాణ స్థితిని గురించి చెప్పుకు పోతున్నాడు. ఎదురుగా ఉన్న ఒక శ్రోత నిద్రపోతున్నాడు. తన దృష్టిని అతని మీద సారించాడు. అప్పుడు బుద్ధుడు ఒక మాట చెప్పాడు అతిగా తినేవాడు, అతిగా నిద్ర పోయేవాడు. పునర్జన్మ నుంచి బయట పడలేడు. అతిగా నిద్ర పోయేవాడు. అతిగా భోజనం చేసేవాడు, ఎంత సాధన చేసినా సరే, తిరిగి జన్మ రాకుండా చేసుకోలేడు. తప్పనిసరిగా పునర్జన్మలో పడిపోతాడు. పునర్జన్మ నుంచి విడుదల పొందలేడు. ఎవడు? అతిగా తినేవాడు. అతిగా నిద్ర పోయేవాడు.

అందుచేత నువ్వు మధ్యే మార్గం అవలంబించాలి. గౌతమబుద్ధుడిది మధ్యే మార్గం. ఉపవాసాలు పనికి రావు. అతిగా తినవద్దు. యుక్తంగా తినండి. మితంగా మాట్లాడండి. సరిపడా నిద్రపోండి. తీగని బాగా లాగితే తెగిపోతుంది. వదులుగా ఉంటే పాట పలకదు. అందుచేత మీ మనస్సు అనే తీగని సమానంగా ఉంచుకోండి. అతి ఏ విషయంలోనూ పనికిరాదు. నా బోధ విన్నా, నువ్వు ఎన్ని ఉపనిషత్తులు చదువుకున్నా, ఏ హిందూ ధర్మాన్ని నువ్వు అనుసరిస్తున్నప్పటికీ, అతిగా మాట్లాడే వాడు, అతిగా నిద్ర పోయేవాడు, అతిగా భోజనం చేసేవాడు పునర్జన్మ నుంచి బయట పడలేడు అన్నాడు బుద్ధుడు. మహానుభావా, నాకు నిద్ర అనేది చాలా ఇష్టం, భోజనం అనేది నాకు చాలా ఇష్టం. నాకు భోజనం చెయ్యటం,

నిద్ర పోవటం ఇదే నాకు జీవితంలో చాలా ప్రియాతిప్రియమైనవి. జాగ్రత్తగా తినమని మీరు ముందు చెప్పే మాటలు కూడా విన్నాను. కాని నాకు అతిగా తినటం అనేది ఒక వాసన. అతిగా తినటం అనేది విడిచి పెట్టలేను ఆచార్యా అన్నాడు. ఈ సంఘటన కోసం ఇది మీకు చెప్పటం లేదు. అప్పుడు గౌతమ బుద్ధుడు ఒక మాట అన్నాడు. నీకు మంత్రం చెబుతాను. ఆ మంత్రాన్ని నువ్వు జపించుకుంటూ ఉండు. వాళ్ళు ఎంత కరుణామయులో చూడండి. ఎవడో వాడు అతిగా భోజనం చేస్తే మనకి ఏమిటి అని కాకుండా, అతన్ని కూడా ఉద్ధరించాలని, అతన్ని మనతో పాటు తీసుకు పోవాలని, నీకు మంత్రం చెబుతాను. ఆ మంత్రాన్ని నువ్వు ఉచ్ఛారణ చేసుకో, ఆ మంత్రాన్ని ఉచ్ఛారణ చెయ్యగా, చెయ్యగా, నీకు అతి నిద్ర - అతి భోజనం తగ్గుతుంది. సమాన స్థాయిలోకి వస్తావు. సమస్థితిలోకి వస్తావు అన్నాడు. వాడు జీవితంలో ఎంత సోమరితనానికి అలవాటు పడిపోయాడు అంటే ఆచార్యా నాకు అతి తిండి ఎలా అలవాటు ఉందో, అతి నిద్ర ఎలా అలవాటు ఉందో, జ్ఞాపక శక్తి కూడా నాకు లేదు అన్నాడు. ఎంత కరుణామయుడో బుద్ధుడు చూడండి. అప్పుడు కూడా అతన్ని విడిచి పెట్టలేదు. మనం అతన్ని చూసి అసహ్యించుకోవచ్చు. అతన్ని చూసి ఏవగించు కోవచ్చు. అతన్ని మొద్దు అబ్బాయి అని వదిలి వేయవచ్చు. కాని బుద్ధుడి యొక్క కరుణ అక్కడ కూడా ఆగలేదు. అతి నిద్ర అన్నాడు, అతి భోజనం అన్నాడు మీరు చెప్పే మంత్రం అనుకోలేను అన్నాడు, నాకు మరుపు ఎక్కువ అన్నాడు అప్పుడు కూడా అతన్ని బుద్ధుడు వెంటాడుతున్నాడు. అప్పుడు అన్నాడు మీ ఇంట్లో వాళ్ళు ఎవరైనా ఇక్కడకు వచ్చారా? అని



**నదిని దాటటానికి నావ ఎటువంటిదో ఈ సంసార సాగరం దాటటానికి సత్సంగం నీకు నావలాగ ఉపయోగపడుతుంది.**

అడిగాడు బుద్ధుడు. మా ఇంట్లో వాళ్ళు వచ్చారు అని చెప్పాడు. వాళ్లకి నేను ఈ మంత్రం చెబుతాను. వాళ్ళు నీ చెవిలో అస్తమాను ఊదుతూ ఉంటారు, బుద్ధుడు ఎంత కరుణామయుడో చూడండి. అది బుద్ధుని యొక్క దయ. బుద్ధుని యొక్క కరుణ. అయితే ఇటువంటి కరుణ, ఒక్క జ్ఞాని లోంచి మటుకే వస్తుంది. విశాలమైన హృదయం, లోతైన హృదయం, అతి గంభీరమైన మనిషి లోంచే ఈ కరుణ వచ్చి మానవజాతిని తడుపుతుంది కాని, సామాన్య మానవుడు ఇటువంటి కరుణని చూపించలేడు. భోజనం ఒక వాసన. నిద్ర ఒక వాసన, ద్వేషం ఒక వాసన, సెక్స్ ఒక వాసన, ఇలా ఎన్నైనా వాసనలు ఉండవచ్చు కాని మొదటి వాసన, ప్రధమ వాసన, ప్రధాన వాసన అహంకారమే అంటున్నారు రమణస్వామి. ఒక వాసన కాదు, రెండు కాదు, అనంతం. అనంతమైన వాసనలు సృష్టిలో ఉన్నాయి. నీ వాసనలు వేరు, నా వాసనలు వేరు. నీ కోరికలు వేరు, నా కోరికలు వేరు. కాని మొదటి వాసన, అది కూడా వాసనే. ఏది? అహంకారం. ఈ నేను, నేను అనేది నిజం కాదు. అది కూడా ఒక వాసనే అన్నారు రమణస్వామి. నీకు వచ్చే కోరికలే వాసనలు కాదు. మీరు అందరూ నేను నేను అంటున్నారు. ఆ నేను అనేది కూడా ఒక వాసనే, అది నిజం కాదు. ఈ వాసనను అంటి పెట్టుకుని మిగతా వాసనలు అన్నీ ఉంటున్నాయి. ఈ వాసన జారిపోతే మిగతా వాసనలు ఉండటానికి అక్కడ చోటు లేదు. భగవాన్ ముత్యం లాంటి ఒక మాట చెప్పారు. బంగారం కంటే, రత్నాలు కంటే, భూమి మీద ఉన్న ఏ వస్తువు తోటి పోల్చలేము ఈ మాటలని, భగవాన్ చెప్పిన ఈ మాట ఏమిటంటే, నేను అంటే నువ్వు ఆత్మ అనుకోవటం లేదు. నేను అంటే నువ్వు అహంకారం అనుకుంటున్నావు. అందుకే అది నీకు తగ్గటం లేదు. నేను నేను అని మనం అంటున్నాం. ఈ నేను అన్నప్పుడు మనకు ఆత్మ స్ఫురణ రావటం లేదు. దేహస్ఫురణే వస్తోంది. ఆత్మస్ఫురణ కనుక వస్తే ఈ అహంకారం రాలిపోతుంది. నేను అన్నప్పుడు మనకు ఆత్మ స్ఫురణ రావటం లేదు. దేహ స్ఫురణ వస్తోంది. మనస్సు యొక్క స్ఫురణ వస్తోంది. అందుచేత ఇది బలపడి పోతుంది. భగవాన్ ఏమీ అన్నారు అంటే నేనేమో నేను నేను అంటాను. మీరు నన్ను ఏమీ అంటారు అంటే నువ్వు అంటారు. ఇంతకు నేను నేనా? నువ్వా? అన్నారు భగవాన్. ఇంతకు ఎవరిని నేను?

నేనునా? నువ్వునా? ఇది అర్థం చేసుకోండి ఇవి రెండు పోతాయి అన్నారు భగవాన్. దక్షిణామూర్తి అస్సలు మాట్లాడే వాడు కాదు. మౌనంతోనే ఆత్మ యొక్క బోధలు చేసేవాడు. రమణమహర్షి గారు ఏమీ చేశారు అంటే ఇటు దక్షిణామూర్తి పద్ధతి అవలంభించలేదు. అటు శంకరాచార్యుల పద్ధతి అవలంభించలేదు. పూర్తిగా మౌనంగా ఉన్నాడా అంటే పూర్తిగా మౌనంగా లేడు రమణస్వామి. శంకరాచార్యుల వారిలా దేశం అంతా తిరిగి ఉపన్యాసాలు చెప్పి, చర్చలు చేసి, ప్రచారాలు చేసి ఇవన్నీ చేశాడా అంటే అవి చేయలేదు. అంటే శంకరాచార్యుల వారి యొక్క మాటలు ఆ బోధ, దక్షిణామూర్తి మౌనం, ఇవి రెండు కలిపి, ఈ scientific ageలో మనకు జ్ఞానాన్ని అందజేశాడు. రమణ మహర్షిలో ఉన్న ప్రత్యేకత ఏమిటంటే, ఎన్నడూ, ఎప్పుడూ, శాస్త్రీయ దృష్టిని ఆయన విడిచి పెట్టలేదు. అటు దక్షిణామూర్తి యొక్క తత్వాన్ని, ఇటు శంకరాచార్యుల వారి యొక్క తత్వాన్ని, తనలో ఇముడ్చుకుని, రమణస్వామి ఈ modern ageలో తన ఆత్మసందేశాన్ని మన అందరికి అందజేశాడు. నువ్వు ఆత్మను తెలుసుకుని తీరాలి అని వేదాలు చెప్పినవి, ఉపనిషత్తులు చెప్పినవి, అన్ని మత గ్రంథాలూ చెప్పినవి. ఎందుచేత ఆత్మను తెలుసుకోవాలి. మోక్షం ఎక్కడుంది? ఆత్మలోనే మోక్షం ఉంది. ఆత్మను తెలుసుకోకుండా ఎవరైనా మోక్షం పొందారు అంటే అది నూటికి నూరు పాళ్ళు అసత్యం. అది నూటికి నూరు పాళ్ళు అవాస్తవం. నువ్వు ఆత్మను ఎందుకు తెలుసుకోవాలి? మోక్షం ఎక్కడుంది? ఆత్మలోనే ఉంది. నీకు ఏ దృశ్యం కనిపించినప్పటికీ, ఏ దృశ్యం కూడా నిజం కాదు. అన్ని దృశ్యాలు అబద్ధాలే. మనకి స్వప్నంలో కనిపించే దృశ్యాలు ఎటువంటివో, ఈ జాగ్రదావస్థలో కనిపించే దృశ్యాలు అన్నీ కూడా అటువంటివే. మీ మనస్సు గాఢనిద్రలో ఎక్కడుంది? ఆత్మలోనే ఉంది. అయితే జాగ్రదావస్థలో అక్కడ ఎందుకు ఉండటం లేదు? జాగ్రదావస్థలో కూడా అది ఉంటుంది. కాని నీలో ఉన్న వాసన, నీకున్న కోరిక, నీకున్న తలంపులు, ఆ మనస్సును బయటకి లాక్కొచ్చేస్తున్నాయి. ఆ తలంపు ఎప్పుడైతే పోయిందో, ఆ కోరిక ఎప్పుడైతే పోయిందో, మళ్ళీ సడెన్ గా వెళ్లి ఆ హృదయగుహలో ఈ మనస్సు పడిపోతుంది, ఆత్మ ఆకారం చెందుతుంది. మీకు ఎప్పుడైతే వాసనా క్షయం అయ్యిందో, తలంపులు ఎప్పుడైతే పోయాయో, కోరికలు ఎప్పుడైతే నీకు రాలిపోయాయో,

అప్పుడు మనస్సు సడెన్‌గా వెళ్లి హృదయగుహలో పడిపోతుంది అయ్యా, దాని స్వరూపంలోకి వెళ్లి కలిసిపోతుంది. నీ మనస్సు యొక్క స్వరూపం తలంపు కాదు. నీ మనస్సు యొక్క స్వరూపం కోరిక కాదు. నీ మనస్సు యొక్క స్వరూపం ప్రపంచం కాదు. నీ మనస్సు యొక్క స్వరూపం ఎక్కడో బయట లేదు. నీ మనస్సు యొక్క స్వరూపం ఆత్మే. అది ఆత్మ లోంచే వచ్చింది. అందుచేత ఎప్పుడైతే నీకు వాసనా క్షయం అయ్యిందో, అతి వేగంగా వెళ్లి మనస్సు ఆత్మ ఆకారం చెందుతుంది.

భగవాన్ చెప్పిన ఈ మాటను ఇది నిరంతరం మీరు జ్ఞాపకం ఉంచుకోండి. ఇది జ్ఞాపకం ఉంచుకుంటే మీరు ప్రమాదంలో పడరు. భగవాన్ ఏమీ చెప్పారు అంటే అహంకారం తోటి కనుక ఎదుటి మనిషికి ఉపకారం చేసినా, ఆ ఉపకారం వీడికి కాని, పొందిన వాడికి కాని ఇద్దరికీ కూడా ఉపయోగం ఉండదు అని చెప్పారు. ఏమీ మాటలండీ, immortal words. మన దేహం నశిస్తుంది కాని ఈ మాటకు నశింపు లేదు. ఎందుచేత? ఈ మాటలో సత్యం ఉంది. సత్యం లేని మాట కాలప్రవాహంలో కొట్టుకుపోతుంది. మీరు ఈ మాట వినటం ఇష్టం లేకపోతే, ఈ మాటలు వినటం వల్ల మీకు రోతగా ఉంటే, ఒక తాడి లోతు గొయ్యి తీసి, ఈ మాటను ఆ గొయ్యిలో కప్పెట్టేసినప్పటికి, ఆ గోతిని విడదీసుకుని బయటకు వచ్చి ఈ మాట మీ ఎదురుగా నిలబడుతుంది. ఈ మాటలు ఎవడు చెప్పగలడు? ద్వేష రహితుడే చెప్పగలడు. తోటి మానవుని చూసి ద్వేషించే మనిషి ఇటువంటి మాటలు చెప్పలేడు. ఎవడైతే ద్వేష రహితుడో వాడు మటుకే ఈ మాటలు చెప్పగలడు. ఈ మాటలకి స్పందిస్తాడు. భగవాన్ చెప్పిన ఈ మాటలు వినేవాడిలో కూడా ఎవడికి అయితే ద్వేషం లేదో, వాడి హృదయంలోనే స్పందన కలుగుతుంది. హృదయం ద్వేష పూరితం అయితే ఆ హృదయంలో స్పందన కలుగనే కలగదు. నువ్వు అహంకారం తోటి ఎదుటి వాడికి ఉపకారం చెయ్యవచ్చు. అహంకారంతోటి ఎదుటి వాడికి నువ్వు మంచి చెయ్యవచ్చు, దాని వల్ల నువ్వు కాని, నీ వల్ల ఉపకారం పొందిన వాడు కాని బాగుపడరు. నీవు అహంకారం తోటి ఎదుటి వాడికి ఉపకారం చేస్తే నీ అహంకారం పెరుగుతుంది. నీ వల్ల ఉపకారం పొందిన వాడికి, వాడికి జ్ఞానం రాదు సరికదా, దేహబుద్ధి పెరుగుతుంది. బాహ్య ప్రక్రియల

వల్ల, బాహ్య చేష్టల వల్ల, మనస్సు కరగదు, అది హృదయంలో, ఆత్మలో కరగాల్సిందే కాని ఇంకొక దారి లేదు అని మిమ్మల్ని చూశాక నాకు తెలిసింది. మీరు చెప్పలేదు నాకు, మిమ్మల్ని చూశాక నాకు తెలిసింది అని రాసారు. నాకు గగుర్పాటు వచ్చింది. అతనికి నేను ఏమీ మాటలు చెప్పలేదు? ఊరికే వచ్చేవాడు, మౌనంగా కూర్చొనేవాడు. ఇవన్నీ ఇంగ్లీషులో రాసాడు అతను, ఈ పాద నమస్కారాల వల్ల, బాహ్య వేషాల వల్ల మనస్సు కరుగదు, ఏదో ఉపాయం ఆలోచించాం అంటారు చూడండి అలాగ ఈ బాహ్య ఉపాయాల వల్ల, దేనివల్ల మనస్సు కరగదు అని, బాహ్యమైన చేష్టల వల్ల మనస్సు కరగదు అని, అది దేవునిలో, ఆత్మలో, హృదయంలో మనస్సు కరిగితేనే, మోక్ష రాజ్యాన్ని అందుకోగలమని, అంతకంటే ఇంకో గత్యంతరం లేదు అని, మీరు చెప్పలేదు. మిమ్మల్ని చూశాక నాకు తెలిసింది అని వ్రాసాడు. మీ జన్మలు మారితే అహంకారం పోదు. పరిసరాలు మారితే అహంకారం పోదు. కొన్ని కొన్ని సందర్భాలలో పరిసరాలు మారితే అహంకారం పెరుగుతుంది అని భగవాన్ చెప్పారు. అందుచేత నువ్వు తెల్ల బట్టలు వేసుకున్నావా? ఎర్ర బట్టలు వేసుకున్నావా? ఏ పరిసరాలలో నువ్వు జీవిస్తున్నావు? ఏ జన్మలో ఉన్నావు అనేది ప్రధానం కాదు. నువ్వు పోగొట్టుకోవలసింది నీలోనే ఉంది అదే అహంకారం. నువ్వు ఏ మతంలో ఉన్నావు, ఏ దేశంలో ఉన్నావు. ఏ కులంలో ఉన్నావు, ఏ పరిసరాలలో ఉన్నావు, ఏ పద్ధతిలో ఉన్నావు, నువ్వు స్త్రీవా? పురుషుడివా? ఏ మతస్తుడవు? ఇది కానే కాదు. నువ్వు అహంకారం తొలగించుకో నువ్వు ఆత్మ సింహాసనం మీద కూర్చొంటావు అని రమణస్వామి చెబుతున్నాడు. అదే ఆయన

**మీరు పెద్ద పెద్ద సాధనలు చేయకపోయినా మహాత్ముల సమక్షంలో వాసనలు అణుగుతాయి, మనస్సు నిర్మలమవుతుంది, సమాధి స్థితిని మీకు ప్రసాదిస్తారు. ఇది సత్పురుషుల యొక్క భిక్ష.**



ముఖ్యమైన సందేశం. నీ మనస్సు అనే సమస్యను పరిష్కారం చేసుకోవటానికి నీ మతం కాని, నీ కులం కాని, నీ దేశం కాని ఏమీ అడ్డు రావు. ఇవన్నీ బాహ్యమైన కల్పితాలు. ఇవన్నీ కల్పించుకున్నవే. ఈ మతాలు, ఈ కులాలు, ఇవన్నీ మనస్సు యొక్క కల్పితములే. మనస్సు కల్పితం కానిది ఒక్కటే ఒకటి ఉంది అది ఆత్మ. ఆత్మ లాభం ఎలా పొందాలి? ఆత్మని ఎలా అనుభవంలోకి తెచ్చుకోవాలి? అక్కడే శాంతి ఉంది కదా, దాన్ని ఎలా మేము అందుకోవాలి? మాకు ఉపాయం చెప్పండి అని వైశ్యులు భగవాన్‌ను అడుగుతున్నారు. ఆత్మ ఎప్పుడూ ప్రత్యక్ష దైవం. అది ఉండని క్షణం లేదు. ఆత్మ లాభం పొందడం ఎలా అని మీరు అడుగుతున్నారు. లాభం అంటే భగవాన్ అణువు అణువును చీల్చి చెండాడేస్తాడు ఆయనకి వేరు పాటుగా బాణాలు అక్కర్లేదు. మీ నోటి వెంట వచ్చిన మాటనే బాణంగా చేసుకుని మీ మీద ప్రయోగిస్తాడు. ఉపనిషత్తుల గొడవ, వేదాల గొడవ ఆయనకు అక్కర్లేదు. ఈ యావత్తు మానవజాతి దేనిని తెలుసుకోవడం కోసం ప్రయత్నం చేస్తోందో, అది ఆయన అయి ఉన్నాడు. అది ఆయన అనుభవంలో ఉంది. అందుచేత ఆయనకి ఋజువులు తోటి కాని, శాస్త్రాల తోటి కాని పని లేదు. ఈ వైశ్యుల దగ్గర నుంచి ప్రశ్న వచ్చింది. ఆ ప్రశ్నే తిరిగి వాళ్ళ మీదకి తిప్పి కొడుతున్నాడు. అంతేగాని, ఉపనిషత్తులో ఇలా ఉంది. భగవద్గీతలో ఇలా ఉంది, బైబిలులో ఇలా ఉంది అని దండకాలు చదవవలసిన పని ఆయనకి లేదు. ఆత్మ లాభం పొందటం ఎలా అంటున్నారు? లాభం అంటే ఇప్పుడు లేదు అని, కొత్తగా సంపాదించేది లాభం అంటారు. ఎప్పుడో పొందుతాం అంటున్నారు. అయితే ఇప్పుడు లేదా? ఆత్మ లేకుండా మీరు ఉన్నారా? ఆత్మ లేకుండా క్షణం లేదు. అహంకారం గాఢనిద్రలో మిమ్మల్ని విడిచి పెట్టి ఉంటుంది. కాని ఆత్మ మటుకు మిమ్మల్ని విడిచి పెట్టి ఉండటంలేదు. జాగ్రదావస్థలో ఆత్మ ఉంది. స్వప్నావస్థలో ఆత్మ ఉంది. సుషుప్తావస్థలో గాఢనిద్రలో ఆత్మ ఉంది. అహంకారం గాఢనిద్రలో మిమ్మల్ని విడిచి పెట్టి వెళ్ళిపోతుంది కాని అప్పుడు కూడా మిమ్మల్ని ఆత్మ విడిచి పెట్టి వెళ్ళటం లేదు. అప్పుడు కూడా సదా ఆత్మ ఉండనే ఉంది. ఆత్మ లేని క్షణం లేదు. నువ్వు అనుకునే దేశం, నువ్వు అనుకునే కాలం, నువ్వు అనుకునే పరిస్థితులు, నువ్వు అనుకునే విషమ గడియలు, నువ్వు అనుకునే కష్టాలు, నువ్వు అనుకునే నష్టాలు, నువ్వు అనుకునే

రోతలు, ఇవన్నీ ఎక్కడ ఉన్నాయి? ఆత్మలో లేవు, నీ దేహంలో లేవు. మరి ఎక్కడ ఉన్నాయి? నీ అహంకారంలో ఉన్నాయి. నీ మనస్సులో ఉన్నాయి. బాహ్యంగా డబ్బు ఉన్నవాళ్ళని, అధికారం ఉన్నవాళ్ళని, గౌరవించడానికి మనం అలవాటు పడిపోయాం కాబట్టి గౌరవిస్తాము. కాని ఇందులో ఎంత హేతువాదం ఉంది. జవహర్ లాల్ నెహ్రు ఒక మాట చెప్పాడు. అతని స్నేహితుడు దిలీప్ కుమార్ రాయ్ అని ఒకతను ఉండేవాడు. దిలీప్ కుమార్ రాయ్ అతను కూడా IPS వరకు చదువుకున్నాడు. గొప్ప సంగీత విద్వాంసుడు. ఆంగ్ల భాషలో అపూర్వమైన రచయిత. అతను among the great అని ఇంగ్లీషులో గొప్ప గ్రంధం రాసాడు. రస్సెల్ గురించి, మహాత్మా గాంధీ గురించి, బెర్నాడ్ షా గురించి, మన భారత దేశంలోనే కాదు ప్రపంచంలో ఉన్న ప్రముఖులు గురించి, among the great అని దిలీప్ కుమార్ రాయ్ గ్రంధం రాశాడు. అతను కూడా భగవాన్ దగ్గరకు వస్తూ ఉండేవాడు. అతనికి ఆంగ్ల భాషలో ఎంత పరిచయం ఉందో, సంగీతం పట్ల కూడా అంత పరిచయం ఉంది. భగవాన్ దగ్గర అద్భుతంగా పాటలు పాడుతూ ఉండేవాడు. అతనికి, జవహర్ లాల్ నెహ్రూకు కూడా పరిచయం ఉంది. జవహర్ లాల్ నెహ్రు ప్రధాన మంత్రి అయిన కొత్తలో మాములుగా ఇతనికి తెలియ పరిచాడు. నువ్వు ప్రధాన మంత్రివి అయ్యావు ఒకసారి వచ్చి నిన్ను చూసి వెళతాను. అని దిలీప్ కుమార్ రాయ్ రాశాడు. నువ్వు వచ్చి నన్ను చూస్తాను అంటే నాకు అంతకంటే సంతోషం ఏముంది? ఫలానా టైములో, ఫలానా గంటలో నువ్వు రా, నేను రిసీవ్ చేసుకుంటాను. ఆ టైములో మటుకు నేను ఎవరిని పురమాయించుకోను మాట్లాడటానికి, సాయంత్రం ఒక గంట నీతోటి గడుపుతాను. నాకు అంతకంటే ఏమీ కావాలి, పైగా మీరే చెబుతున్నారు మా ఇంటికి వస్తాను అని, నాకు పరమ సంతోషం అన్నాడు నెహ్రూ.

ఆ మధ్యాహ్నం నెహ్రు గారి సెక్రటరీ దగ్గర నుంచి ఇతనికి ఫోను వచ్చింది. ఎవరి దగ్గరకు? ఇవాళ సాయంత్రం ఆరు గంటల నుండి ఏడు గంటల వరకు జవహర్ లాల్ నెహ్రు గారు మీతో కలుస్తాను అని చెప్పారు కదా, ఒక గంట సేపు మీతో మాట్లాడటం కుదరదు. పదిహేను నిమిషాలే మీతో మాట్లాడుతారు అన్నాడు. పదిహేను నిముషాలు మటుకు ఎవరికి కావాలి? వాడితోటి మాట్లాడవలసిన పని నాకు లేదు అన్నాడు దిలీప్

కుమార్ రాయ్. వాడు ప్రధాన మంత్రి అని నేను రావటం లేదు. చాలా కాలం నుంచి ఇద్దరం స్నేహితులం. నేను ఇప్పుడు ఢిల్లీలో ఉన్నాను. ఒకసారి పలకరించి వద్దాం అనుకుంటున్నాను. అతను ఏమీ నాకు లైసెన్సు ఇవ్వక్కర్లేదు. ఉద్యోగం ఇవ్వక్కర్లేదు. ఊరికే సరదాగా స్నేహితుడు ప్రైమ్ మినిస్టర్ అయ్యాడు కదా చూసి వద్దాం అనుకున్నాను. అతను నాకు గంట అని చెప్పాడు. అతనికి టైము లేకపోతే పదిహేను నిముషాలు మటుకు నాకు ఎందుకు? అసలు రానని చెప్పు మీ ప్రైమ్ మినిస్టర్ కి అని చెప్పాడు దిలీప్ కుమార్ రాయ్. వైరాగ్యం ఉన్నవాడికి ఈ సృష్టి గడ్డి పరక తోటి సమానం. ఆశ ఉన్నవాడికి సృష్టి మీద మోహం ఉంటుంది కాని, వైరాగ్యం ఉన్న మనిషికి, సృష్టే లేని వాడికి, అసలు ప్రధాన మంత్రి ఏమిటి? ముఖ్య మంత్రి ఏమిటి? అసెంబ్లీ ఏమిటి? పార్లమెంటు ఏమిటి? అధికారం, డబ్బు, గౌరవాలు, ఇవన్నీ ఎవడికి? సృష్టి ఉన్నవాడికి. రామకృష్ణ పరమహంస చెప్పాడు వైరాగ్యం ఉన్నవాడు చంటి పిల్లవాడు, మీరు బంగారపు గొలుసు ఇస్తే బంగారపు గొలుసు పక్కన విసిరేసి లక్క పిడతల తోటి ఆడుకుంటాడు. వైరాగ్యం ఉన్నవాడు అంతే, ఈ సృష్టి యొక్క వైభవాన్ని అంతటిని వదిలేసి దేవుడు తోటి ఆడుకుంటాడు. సరే సాయంత్రం ఆరు అయిపోయింది. దిలీప్ కుమార్ రాయ్ రాలేదు. ఈ సెక్రటరీ చెప్పిన మాట నెహ్రూకు చెప్పలేదు. ఇలా టైము చూసుకుంటున్నాడు నెహ్రూ ఆరు అయిపోయింది. ఏడి దిలీప్ కుమార్ రాయ్ ఏడి? ఆరింటికి వస్తాను అన్నాడు. ఏడి రావటం లేదా దిలీప్ కుమార్ రాయ్ అన్నాడు. సెక్రటరీని పిలిచాడు. ఏడి దిలీప్ కుమార్ రాయ్ వస్తాను అన్నాడు ఆరింటికి అని, అప్పుడు సెక్రటరీ చెప్పాడు గంట సేపు మాట్లాడడానికి మీకు అవకాశం లేదు ఒక పావుగంట మాట్లాడుతారు అని ఆయనతో చెప్పాను. పావుగంట అయితే ఆయన పని ఆయనను చూసుకోమను, నా పని నేను చూసుకుంటాను అన్నారు అని చెప్పాడు. నేను నీతో చెప్పానా అలా పావుగంట అని, ఇప్పుడు immediateగా వెళ్లి దిలీప్ కుమార్ రాయ్ ఎక్కడ ఉన్నా సరే పట్టుకు తీసుకురా అన్నాడు నెహ్రూ. అంటే నా అధికారం నా స్నేహితున్ని కూడా చూడనివ్వదా? నేను అతనికి గంట టైము ఇచ్చాను. అతను ఎక్కడ ఉన్నా సరే తీసుకు రండి. అతను ఎక్కడున్నా సరే పట్టుకు రండి దిలీప్ కుమార్ రాయ్‌ని. ఇంతకు ఇవన్నీ

ఎందుకు చెబుతున్నాను అంటే ఈ అధికారం, గౌరవాలు ఇవన్నీ ఎక్కడ ఉన్నాయి? మనస్సులో, మనస్సు దాటితే ఏమీ లేవు. అధికారం ఎక్కడ ఉంది? మనస్సులో ఉంది. ధనం ఎక్కడ ఉంది? మనస్సులో ఉంది. గౌరవం ఎక్కడ ఉంది? మనస్సులో ఉంది. మీరు ఒక్కటే జ్ఞాపకం ఉంచుకోండి ప్రపంచంలో ఏ జ్ఞాని కూడా గౌరవాన్ని లెక్క చేయడు. ఎందుచేత? తనకంటే భిన్నంగా ఏమీ లేదు. నాకంటే భిన్నంగా మీరు ఉంటే మీ గౌరవం నాకు కావాలి. నాకంటే భిన్నంగా ఏమీ లేనప్పుడు ఎవరి నుంచి గౌరవం పొందాలి. ఏ జ్ఞాని కూడా ప్రపంచం నుంచి గౌరవం ఆశించడు. గౌరవాన్ని ఆశిస్తే వాడు జ్ఞానే కాదు. గౌరవాన్ని గనుక సృష్టిలో ఎవడైనా ఆశించాడు అనుకోండి వాడికి జ్ఞానం లేదు. ఎందుచేత? తనకంటే భిన్నంగా ఏమీ లేదు. గౌరవం ఆశించటానికి, ఉన్నది ఒక్కటే. ఎవరు గౌరవిస్తారు? ఎవరిని గౌరవిస్తారు? నువ్వు అహంకారం తోటి పని చేశావా నువ్వు బంధింప పడతావు. నీ చేత ఉపకారం పొందిన వాడు కూడా బంధింప పడతాడు. ఎందుచేత? కొంతమంది బాహ్యమైన వస్తువులు ఆశించక పోయినా గౌరవాలని ఆశిస్తారు. అందుచేత నువ్వు బంధింప పడతావు. ఇది అహంకారం యొక్క చేష్ట అన్నారు రమణస్వామి. నీ మనస్సులో అనేక గొడవలు ఉండవచ్చు. నీ మనస్సులో, అనేక స్పందనలు, అనేక కంపనాలు ఉండవచ్చు. కాని నీ హృదయంలో, హృదయం అంటే గుండె కాయ అనుకోకండి, ఈ గుండె కాయ, ఈ మాంసం, ఈ ఎముకలు, స్మశానంలో కాలిపోయి బూడిద అయిపోతాయి. భగవాన్ చెప్పేది ఆధ్యాత్మిక హృదయం. ఈ ఆధ్యాత్మిక హృదయానికి, ఈ దేహానికి అణు మాత్రం, కొంచెం



**వినయం కలవాడే**
**గురువు దగ్గర శ్రవణం చేయగలడు.**
**సబ్జక్టు విసుగు వచ్చేలాగ వినాలి.**
**శ్రవణం చేస్తేనే కదా**
**ఏమి సాధించాలో తెలిసేది?**


కూడా, స్వల్పంగా కూడా సంబంధం లేదు. భగవాన్ చెబుతున్నారు భౌతికంగా మీరు అందరూ పుట్టారు. మరి ఆధ్యాత్మికంగా మీరు అందరూ ఎప్పుడు పుడతారు? మీ అమ్మ కడుపులోంచి నువ్వు పుట్టావు. ఆ హృదయ గుహలో ఎప్పుడు పుడతావు? భౌతికంగా నువ్వు పుట్టావు. కాని ఆధ్యాత్మికంగా ఎప్పుడు పుడతావు? హృదయ కేంద్రంలో ఎప్పుడు ప్రవేశిస్తారు? హృదయ కుహర మధ్య ఉన్నది కేవలం బ్రహ్మ మాత్రమే, అక్కడ ఈ దేవతలు లేరు, అక్కడ ఈ సృష్టి లేదు. ఈ జాతి లేదు, ఈ మతం లేదు, ఇవన్నీ కల్పించినవి అక్కడ ఏమీ లేవు, కేవలం బ్రహ్మ మాత్రమే. ఆ హృదయ కుహరంలో, ఆ హృదయ గుహలో, కేవలం బ్రహ్మ మాత్రమే, రెండో దానికి స్థానం లేదు అక్కడ. కేవలం బ్రహ్మమే ప్రకాశిస్తుంది. ఎలా ప్రకాశిస్తుంది? నేను, నేను, నేను, అని బ్రహ్మము ఒక్కటే ప్రకాశిస్తుంది. అక్కడ లింగ బేధము లేదు, కుల బేధము లేదు, దేశం బేధం లేదు, రంగు బేధం లేదు. అక్కడ సృష్టి లేదు. ఏమీ లేదు ఉన్నది ఒక్కటే బ్రహ్మము. ఆ హృదయ గుహలో కేవలం బ్రహ్మం స్వయంగా ప్రకాశిస్తుంది. దానికి సూర్యుడి వెలుతురు, చంద్రుడి వెన్నెల అక్కర్లేదు. దేహం ఉన్నా అది ఉంది. నీ దేహం రాలిపోయినా అది ఉంటుంది. నీ దేహ స్పర్శ తోటి దానికి సంబంధం లేదు. నీ మనస్సులో ఉన్న గందర గోళాల తోటి దానికి సంబంధం లేదు. కేవలం తనంతట తానుగా ప్రకాశిస్తుంది. నువ్వు నీ మనస్సుని విచారణ ద్వారా కాని, ధ్యానం ద్వారా కాని, ప్రాణాయామం ద్వారా కాని, భక్తి ద్వారా కాని అందులో ముంచు. ఎక్కడ ములగటం? నీ దేహం సంసారంలో ఉండవచ్చు, నీ దేహం సమాజంలో ఉండవచ్చు. కాని మనస్సును తీసుకెళ్ళి అక్కడ ముంచు. ఎక్కడండి ముంచవలసింది? నీ హృదయ గుహలో, ఆ బ్రహ్మములో, ఆ ఆత్మలో, ఆ నిజమైన దేవుడిలో నీ మనస్సును తీసుకెళ్ళి అక్కడ ముంచు. ఎలా ముంచుతావు? విచారణ చెయ్యి, ధ్యానం చెయ్యి లేకపోతే భక్తి మార్గంలో ప్రవేశించు, లేకపోతే ప్రాణాయామం చెయ్యి, నీకు నచ్చిన మార్గాన్ని అనుసరించి నీ మనస్సును తీసుకెళ్ళి అందులో ముంచు. అలా ముంచినప్పుడు ఆధ్యాత్మికంగా నువ్వు పుడతావు. మనస్సును తీసుకెళ్ళి హృదయంలో ముంచడానికి, హృదయంలో లయం చేయడానికి, హృదయంలో ఏకాగ్రం చెయ్యటానికి వందలాది మార్గాలు భగవద్గీతలో పరమాత్మ చెప్పాడు. అందుకే ఆ

పుస్తకానికి అంత ఖ్యాతి వచ్చింది. కేవలం ఏదో భక్తి మార్గం, కర్మ మార్గం, ధ్యాన మార్గం, జ్ఞాన మార్గం ఇలా నాలుగు మార్గాలే చెప్పాడు కృష్ణుడు అని చాలామంది అనుకొంటారు, అలా కాదు మనస్సుని తీసుకెళ్ళి నీ హృదయంలో ముంచటానికి వందలాది ఉపాయాలు, వేలాది ఉపాయాలు గుమ్మరించాడు భగవద్గీతలో, అందుకే ప్రపంచంలో ఏ పుస్తకానికి లేని యశస్సు దానికి వచ్చింది. ఇది కాకపోతే అది, అది కాకపోతే ఇది. ఏదొక రకంగా నిన్ను అంతర్ముఖున్ని చెయ్యటానికి, అనేక కోణాల లోంచి నిన్ను హృదయంలోకి తీసుకు పోవడానికి, ఎన్నో ప్రయత్నాలు భగవంతుడు చేశాడు. ఎందుచేత? ఆయన ఆధ్యాత్మిక తండ్రి. భగవంతుడు మనకి భౌతికమైన తండ్రి కాకపోవచ్చు ఆధ్యాత్మికమైన తండ్రి. Spiritual father. భగవాన్ ఏమీ చెప్పారు అంటే మీకు ధ్యానం కుదిరింది అనుకో ప్రాణాయామం వచ్చేస్తుంది. మీరు విచారణ చేస్తున్నారు అనుకో మీకు ప్రాణాయామం వచ్చేస్తుంది. ఈశ్వరుడి యందు మీకు ప్రీతి కలిగింది అనుకో, మీకు ప్రాణాయామం వచ్చేస్తుంది. అనుకోకుండా, అప్రయత్నంగా, అతి వేగంగా మీకు ఒక నిష్ఠ భగవంతుడి మీద కుదిరితే, ప్రాణాయామం నువ్వు నేర్చుకోనక్కరలేదు. ప్రాణాయామం వచ్చి నిన్ను వరిస్తుంది. నీకు భగవంతుని యందు ప్రేమ కలిగితే, విశ్వాసం కలిగితే, ప్రాణాయామం వచ్చి నిన్ను వరిస్తుంది. నీ నాడులు శుద్ధి చేయబడతాయి. నీ మనస్సు శుద్ధి చేయబడుతుంది. ఈ మాట భగవాన్ చెప్పిన మాట కాదు. యజుర్వేదంలో ఒక మాట ఉంది. ఏమని చెప్పారంటే యజుర్వేదంలో, నీకు శ్రద్ధ లేకుండా, ప్రీతి లేకుండా, ఆప్యాయత లేకుండా, రసజ్ఞత లేకుండా, దేవుడి దగ్గరకు వెళ్ళి ఒక పండు పెట్టినా, పుష్పం పెట్టినా, ఆ పండు దండుగ, ఆ పుష్పం దండుగ. ఏమీ చెబుతున్నారండి? ఎందుకయ్యా? బాహ్యంగా ఎంత మందిని మోసం చేస్తారు మీరు? భగవంతుడు మీ చేష్టల వల్ల మోసపోడు. నువ్వు భగవంతుడికి ఒక పుష్పం పెట్టవచ్చు. లేకపోతే భగవంతుడికి ఒక అరటి పండు ఇవ్వచ్చు. అయితే నీ హృదయంలో రసజ్ఞత లేకుండా, నీ హృదయంలో ప్రేమ లేకుండా, ఆప్యాయత లేకుండా, విజ్ఞత లేకుండా, నీ హృదయంలో స్పందన లేకుండా, ఏమీ లేకుండా బాహ్యంగా ఏదో ఒక అరటి పండో, ఒక పుష్పమో తీసుకెళ్ళి దేవుని పాదాల దగ్గర పెడితే, ఆ పుష్పం దండుగ, ఆ పండు దండుగ అని

వేదం చెబుతోంది. ఎవరో ఒక ఋషి చెప్పిన మాట కాదు. లేకపోతే ఎవరో సామాన్య మానవుడు చెప్పిన మాట కాదు. మోడరన్ సెయింటిస్ట్ చెప్పిన మాట కాదు. ఇది వేద మాత చెప్పిన మాట. మీరు కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి ఈ వస్తువులు దేవుడి దగ్గర పెట్టినా దండుగే. హృదయంలో రసజ్ఞత లేకపోతే దండుగ అని వేదం చెబుతోంది. ఇది నేను చెప్పటం లేదు రమణస్వామి చెప్పటం లేదు. ఇది వేదం చెప్పినటువంటి మాట. ద్వేషంతో కూడిన మనిషి, అసూయతో కూడిన మనిషి మనస్సును హృదయంలో ముంచలేడు. మీకు రమణస్వామి మాటలలో ఎక్కడైనా ఒక్క మాటలో ద్వేషం కనిపిస్తుందేమో మీరు చూడండి. అనేక మాటలు రమణస్వామి నోటి ద్వారా వచ్చాయి. ఒక్క మాటలో ద్వేషం ఉందేమో చూపించండి. ఒక్క మాటలో ఎక్కడైనా సరే మీకు ద్వేషం కనిపిస్తుందేమో చూడండి. ఒక్క రమణస్వామే కాదు ఏ జ్ఞాని ద్వారా కూడా ద్వేషపూరితమైన మాట రానే రాదు. అరిషడ్వర్గాలు అని మన పురాణాలూ చెబుతున్నాయి. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యం. ఈ మధ్యన మా స్నేహితుడు ఏమీ చెప్పాడు అంటే, చివరిది ఏమిటి? మాత్సర్యం. అంటే అసూయ. ఈ మాత్సర్యం ఉన్న మనిషికి వచ్చే దుఃఖం కామ క్రోధ లోభ మోహాలు ఉన్న వాడికి రాదు. ఎదుటి మనిషిని చూస్తే, వాడితో మాట్లాడితే అసూయ వచ్చే మనిషికి వచ్చే దుఃఖం ఇతర గుణాల వల్ల రాదు. అవీ చెడ్డ గుణాలే, కాని అసూయ వల్ల వచ్చేటటువంటి దుఃఖం అధికమైన దుఃఖం. పోనీ దానివల్ల వీడికి ఏమైనా ఉపకారం ఉంటుందా అంటే ఉపకారం ఉండదు. అసూయ ఉన్నవాడికి గంట గంటకి దుఃఖం వచ్చేస్తుంది. ఎందుకంటే వాడికంటే డబ్బు ఉన్నవాడూ, వాడికంటే విద్యావంతుడూ, వాడికంటే అధికారం ఉన్నవాడూ, వాడికంటే గౌరవం ఉన్నవాడూ ఎవడో ఒకడు కనిపిస్తూ ఉంటాడు. వెంటనే వాడికి దుఃఖం వచ్చేస్తుంది. అందుచేత ప్రపంచంలో అన్నింటికంటే ఏ చెడ్డ గుణం వల్ల మనిషికి దుఃఖం వస్తుంది అంటే మాత్సర్యం ఉన్నవాడు మిగతా అన్ని చెడ్డ గుణాలు ఉన్న వాడికంటే ఎక్కువ దుఃఖ పడతాడు. అంటే మిగతా చెడ్డ గుణాల వల్ల దుఃఖం రాదు అని కాదు ఈ అసూయ వల్ల ఎక్కువ దుఃఖం వాడికి వస్తుంది. మనం అనేక విషయాలు చూస్తాము కాని చూసేది ఎవరని పట్టించుకోము. అనేక విషయాలు వింటాం కాని వినేవాడు ఎవడని పట్టించుకోము.

అనేక విషయాలు ఆలోచిస్తూ ఉంటాం కాని ఆలోచించే వాడు ఎవడో పట్టించుకోము. ఎవడు ఈ ఆలోచించే వాడు ఎవడు? ఈ చూసే వాడు ఎవడు? ఈ వినేవాడు ఎవడు? ఆలోచన మంచిదే. చాలామంది మేధావుల ఉద్దేశం ఆలోచనకి అతీతమైనది స్థితి లేదు అని, అయితే ఆలోచన యధార్థమైతే, ఆలోచనే నిజం అయితే, నీ గాఢనిద్రలో నీ ఆలోచనలు ఎక్కడికి వెళ్ళాయి. ఆలోచన మంచిదే కాదు అనటం లేదు. ఆలోచన కూడా అమృతం తోటి సమానమే. అయితే ఆలోచనే కనుక యదార్థం అయితే నీ గాఢనిద్రలో నీ ఆలోచన ఎక్కడికి వెళ్ళింది? మీకు చాలా తెలివితేటలు ఉండవచ్చు. మీ గాఢనిద్రలో మీ తెలివి ఎక్కడికి వెళ్ళిపోయింది? ఆత్మలో ఆనందం ఉంది అని పుస్తకాలలో చెబుతున్నారు మనకి తెలియటం లేదు ఎందుచేత అంటే ఆత్మ మనకు అనుభవంలో లేదు కాబట్టి, ఆత్మలో ఎంత ఆనందం ఉందో బాహ్యంగా మీకు చెప్పాలంటే భగవాన్ కళ్ళు చూడండి. ఆకళ్ళలో ఎంత ఆనందం ఉందో మీకు తెలుస్తుంది. కొంతమంది కళ్ళు చూస్తుంటే వాళ్ళ ద్వేషం మనకు స్పష్టంగా తెలుస్తుంది, ఆ ద్వేషాన్ని ఎంత దాచుకుందాం అన్నా కళ్ళలోకి వచ్చి కూర్చొంటుంది. అలాగే జ్ఞాని కూడా తన ప్రేమను కాని, తన ఆప్యాయతను కాని, తన శాంతిని కాని, తన కళ్ళలో కనిపించకుండా ఉండలేడు. ఆత్మలో ఎంత శాంతి ఉందో, ఆత్మలో ఎంత సౌందర్యం ఉందో, ఆత్మలో ఎటువంటి రసజ్ఞత ఉందో, ఆత్మలో ఎంత కరుణ ఉందో భగవాన్ కళ్ళలోకి చూడండి. భగవాన్ పటాలు మీ దగ్గర ఉన్నాయి కాబట్టి ఆ కళ్ళలోకి చూడండి. ఆత్మ యొక్క వైభవాన్ని ఆ కళ్ళు మీకు పట్టిస్తాయి. ఆత్మ శాంతిని ఆ కళ్ళు మీకు పట్టిస్తాయి.

**రాగము, భయము, క్రోధము వీటిని వదిలిపెట్టటానికి ప్రయత్నం చెయ్యండి. ఎక్కడైతే రాగం ఉంటుందో, అక్కడ మమకారం ఉంటుంది. మమకారం వల్లే దుఃఖం వస్తుంది. మమకారం లేని వాడికి దుఃఖం లేదు.**



మమ్మల్ని ఏమీ చేయమంటారు అని కొంతమంది నన్ను అడుగుతూ ఉంటారు. భగవాన్ కళ్ళలోకి చూడండి సరిపోతుంది అని నేను వారికి చెబుతాను. ఏంటి నాన్నగారు ధ్యానం చేసుకోమనటం లేదు. విచారణ చేసుకోమనటం లేదు. ఇటువంటి మాటలు చెబుతున్నారు అని మీరు అనుకోవచ్చు. కాని అది నాకు చాలా గొప్పగా అనిపిస్తుంది. మీరు చేసే ధ్యానం కంటే, మీరు చేసే జపం కంటే భగవాన్ కళ్ళలోకి చూస్తే మీరు ఎంతో తొందరగా పక్కానికి వస్తారు అని నాకు అనిపిస్తుంది. నాకు ఏది ఇష్టమో అది మీకు చెబుతున్నాను. మీ దగ్గర నుంచి నేను ఏమీ ఆశించటం లేదు. ఆశిస్తే మనస్సులో ఒకటి పెట్టుకుని, మనస్సులో ఒక ఉద్దేశం పెట్టుకుని మాట ఇంకోటి చెబుతాను. నేనే కాదు ప్రపంచం నుంచి ఎవడైనా ఏదైనా ఆశిస్తే వాడు నిజం చెప్పడు. మనస్సులో ఒకటి పెట్టుకుంటాడు. బయటకి ఇంకొకటి చెబుతాడు. మీ దగ్గర నుంచి నేను ఏదైనా ఆశిస్తున్నాను అనుకోండి తప్పనిసరిగా నా మనస్సులో ఒకటి ఉంటుంది. నోటితో చెప్పేది వేరే ఉంటుంది. ఒక ఇంగ్లీషు రచయిత ఏమీ చెప్పాడు అంటే అజ్ఞాని హృదయం నాలుక మీద ఉంటుంది. జ్ఞాని యొక్క నాలుక హృదయంలో ఉంటుంది. ఏమీ immortal words , వాళ్ళు ఎంత కాలిపోయి ఈ మాటలు చెప్పారో, వినేటప్పుడు మీకు ఆనందంగా ఉండవచ్చు, వినేటప్పుడు మీకు సంతోషంగా ఉండవచ్చు. కాని వాళ్ళు జీవితంలో ఎంత అనుభవాన్ని సేకరించుకుని మనస్సుని పిండి ఈ మాట చెప్పారో మీకు ఏమీ తెలుసు. కష్టపడిన వాడికే తెలుస్తుంది. ఏమని చెప్పాడు? అజ్ఞాని యొక్క హృదయం నాలుక మీద ఉంటుంది. జ్ఞాని యొక్క నాలుక హృదయంలో ఉంటుంది. నువ్వు తరించాలి అంటే నువ్వు మోక్షాన్ని పొందాలి అంటే నువ్వు జ్ఞానాన్ని పొందాలంటే ఆత్మను తెలుసుకో అని ఇక్కడ సలహా చెప్పటం లేదు ఆదేశ పూర్వకంగా, You should know that. నువ్వు ఆత్మను తెలుసుకుని తీరాలి. ఇంకొక మార్గం లేదు అంటున్నారు. ఎప్పుడు? నువ్వు తరించాలి అంటే, దుఃఖంలోంచి, పునర్జన్మ నుంచి నువ్వు విడుదల పొందాలి అంటే, ఆత్మని తెలుసుకుని తీరాలి. ఆత్మలో స్వర్గ రాజ్యం ఉంది, ఆత్మలో మోక్షం ఉంది. ఆత్మలో శాంతి ఉంది, ఆత్మలో నిర్వాణం ఉంది. ఆత్మలో అంతా ఉంది. అందులో లేనిది లేదు. కృష్ణుడు అడుగుతున్నాడు గీతలో, ఏ లాభాన్ని పొందిన తరువాత దానికి

మించిన లాభం లేదు అని నీకు తెలుస్తుందో, దేన్ని గ్రహించాక అన్నీ గ్రహించాను అన్న సంతృప్తి నీకు కలుగుతుందో, అట్టి ఆత్మను నువ్వు గ్రహించవా అంటున్నాడు. దేనిని తెలుసుకున్నాక నువ్వు దేశాన్ని, కాలాన్ని, పరిస్థితులను అన్నిటిని దాటి వెళ్ళిపోతావో, అటువంటి ఆత్మని నువ్వు తెలుసుకుని తీరాలి. You must. నీకు ఇంకో మార్గం లేదు. నువ్వు సదా దానిని జ్ఞాపకం పెట్టుకో, దాన్ని సదా స్మరించు, అది నిన్ను లాక్కుపోతుంది. సదా ఆత్మను దృష్టిలో పెట్టుకో, ఆత్మ గురించి విను, ఆత్మ గురించి మననం చెయ్యి, నువ్వు ఆత్మాకారం పొందుతావు తప్పనిసరిగా దాని గురించి శ్రవణం మననం చెయ్యి. భగవాన్ అంటున్నారు ప్రయత్నం చెయ్యండి. ప్రయత్నం లేకపోతే మీకు ఆత్మ తెలియదు అంటున్నారు. ప్రయత్నం ఎవరు చేస్తారు? పట్టుదల ఉన్న వాళ్ళు ప్రయత్నం చేస్తారు. పట్టుదల లేని వాళ్ళు ప్రయత్నం చెయ్యరు. నేను భగవాన్ తోటి అంటున్నాను నువ్వు ప్రయత్నం చేయమంటున్నావు. ప్రయత్నం చెయ్యటానికి పట్టుదల ఉండాలి అంటున్నావు. నేను ప్రయత్నం చేయలేను. నాకు పట్టుదల కూడా తక్కువే. అందుచేత నేను చెయ్యలేకపోతున్నాను, నేను ఓడిపోయాను. అందుచేత నువ్వు నన్ను తీసేసుకో, గ్రేస్ మార్కులు వేసి తీసేసుకో అని చెబుతున్నాను. రోజు ఏదో ఒక రోగం వస్తుంది దేహానికి, ఒక రోజున రొంప, ఒక రోజున జ్వరం, ఇంకో రోజున ఇంకో రోగం. మనస్సు ఒక రెండు నిముషాలు కూడా మనకు కుదురుగా ఉండదు. ఎటో పోతూ ఉంటుంది. ఈ హాల్లో కూర్చొన్నప్పుడు ఒకలా ఉంటుంది. రోడ్డు మీదకి వెళ్ళినప్పుడు ఒకలా ఉంటుంది. అత్తగారిని చూసినప్పుడు ఒకలా ఉంటుంది. అమ్మను చూసినప్పుడు ఒకలా ఉంటుంది. ఈ మనస్సు తోటా నేను దేవుణ్ణి తెలుసుకునేది. ఈ దేహం తోటా నేను దేవుణ్ణి తెలుసుకునేది. ఇటువంటి దేహాన్ని పెట్టుకుని, ఇటువంటి మనస్సుని పెట్టుకుని నేను సాధన ఎంతవరకు చెయ్యగలను? అందుచేత గ్రేస్ మార్కులు వేసి నన్ను ఒడ్డుకు గెంటేయమని భగవాన్‌ను అడుగుతున్నాను. అందుచేత మన తెలివి తేటలు సరిపోవు. ఈశ్వరుడి యొక్క అనుగ్రహం ఉండాలి. మనకు ఈశ్వరుని యందు ప్రేమ కలుగుతుంటే, ఈశ్వరుణ్ణి తెలుసుకోవాలి అనే కాంక్ష కలుగుతోంది అంటే, ఆయన దయ అది, ఆయన దయ లేకుండా ఆయన మీద ప్రేమ కలగదు. ఆయన దయ లేకుండా ఆయనను

తెలుసుకోవాలి అనే కోరిక కూడా మనకు కలగదు. ఈ అరుణాచలం వచ్చిన వారు ఎవరు వట్టి చేతులతో బయటకు వెళ్లరు. నాస్తికులు ఆస్తికులు అవుతారు. ఆస్తికులు భక్తులు అవుతారు. భక్తులు జ్ఞానులు అవుతారు అన్నారు భగవాన్. అరుణాచలం అనేటప్పటికి మనకు ఊరు జ్ఞాపకం వస్తుంది. అరుణాచలం అనేటప్పటికి ఒక క్షేత్రం జ్ఞాపకం వస్తుంది. కాని భగవాన్‌కి అరుణాచలం అనగానే ఊరు జ్ఞాపకం రాలేదు, దేవుడు జ్ఞాపకం వచ్చాడు. పరమేశ్వరుడు జ్ఞాపకం వచ్చాడు. సర్వేశ్వరుడు జ్ఞాపకం వచ్చాడు భగవాన్‌కి. అది జన్మాంతర అనుబంధం. ఈశ్వరుడు శరీరధారి అయి ప్రపంచంలో ఏ క్షేత్రంలో లేడు. ఒక్క అరుణాచలంలోనే శరీరధారి అయి ఉన్నాడు అన్నారు రమణస్వామి. అరుణాచలంలో ఈశ్వరుడు మూడు రూపాలలో ఉన్నాడు. ఒకటి గిరిరూపం, రెండు లింగరూపం, మూడు సిద్ధరూపం. అంటే మనలాగా రక్త మాంసాల తోటి ఉన్నాడు. సిద్ధుడుగా ఉన్నాడు. అది ఆ క్షేత్రం యొక్క వైభవం. మనకున్న అలవాట్లు వల్ల, మనకున్న ఆలోచనల వల్ల దేవుడు లేడు అనుకుంటున్నాం, ఆత్మ లేదు అనుకుంటున్నాం కాని ఆత్మ ఉంది, దేవుడు ఉన్నాడు. మనకున్న అలవాట్ల వల్ల, మనకున్న ఆలోచనల వల్ల దేవుడు లేడు అనుకుంటున్నాం. ఉన్న ఆత్మ లేనట్టుగా ఎందుకు కనిపిస్తోంది? దానికి నాకున్న అలవాట్లే కారణం. నాకున్న ఆలోచనలే, నాకున్న ఊహలే కారణం. చాలామంది మేధావులు అనుకోవచ్చు. ఆలోచనే చివరి స్థితి అని, ఆలోచనే చివరి స్థితి అయితే ఆలోచనే నిజమైన స్థితి అయితే ఆలోచనకి అతీతంగా ఇంకొక స్థితి లేకపోతే నీ గాఢనిద్రలో నీ ఆలోచన ఎక్కడకు వెళుతోంది? నీ తెలివి తేటలు నీ గాఢనిద్రలో ఎక్కడకు వెళ్లిపోతున్నాయి. ఆత్మ చైతన్యం, శరీరం జఢం. కానీ చైతన్యాన్ని, జఢాన్ని కలిపే గ్రంథి ఏది అంటే అది అహంకారం. దానినే చిత్‌జఢగ్రంథి అంటారు. గ్రంథి అంటే ముడి. చైతన్యాన్ని, జఢాన్ని ముడిపెట్టే గ్రంథినే చిత్ జఢ గ్రంథి అంటారు. ఏది ఆ గ్రంథి? ఈ నేను అనే మొదటి తలంపే చిత్ జఢ గ్రంథి. కృష్ణుడికి తలంపు రాలేదా? రాముడికి తలంపు రాలేదా? యేసుకి తలంపు రాలేదా? భగవాన్ కి తలంపు రాలేదా? జ్ఞానికి తలంపు రాదా? తలంపు లేకుండా వ్యవహరించారా? తలంపు లేకుండా నడిచారా? తలంపు లేకుండా భోజనం చేశారా? తలంపు లేకుండా కూర్చొన్నారా? తలంపు లేకుండా

మెలిగారా? తలంపు లేకుండా బోధించారా? అంటే ఎప్పుడైతే ఆత్మానుభవం కలిగిందో, దుఃఖ హేతువైన వాసన, బంధ హేతువైన వాసన రాలిపోతుంది. వాడికి దేహం నిలబడటానికి సరిపడే తలంపే వస్తూ ఉంటుంది. ఆగిపోతుంది. ఇది బాగా గుర్తు పెట్టుకోండి. కృష్ణుడికి తలంపు వచ్చింది. నాకు తలంపు వస్తుంది. రమణ మహర్షికి తలంపు వచ్చింది, మనకు తలంపు వస్తుంది. వివేకానందకి తలంపు వచ్చింది, మనకి తలంపు వస్తుంది. మన తలంపులు దుఃఖ హేతువులు అవుతున్నాయి, భవిష్యత్ జన్మలు రావటానికి బంధ హేతువులు అవుతున్నాయి. జ్ఞానికి తలంపు వస్తుంది కానీ అది దుఃఖ హేతువు కాదు, బంధ హేతువు కాదు. అజ్ఞానికి తలంపు వస్తుంది, అది దుఃఖ హేతువు, బంధ హేతువు. అందుచేత నా తలంపు వల్ల నాకు దుఃఖం వస్తోంది. జ్ఞానికి తలంపు వలన దుఃఖం రాదు. అయితేజ్ఞానికి వచ్చే తలంపు దేహయాత్ర నడవడానికి సరిపడాతలంపు వస్తుంది. జ్ఞాని తలంపు ఆయనను బంధించదు. మనకి తలంపులు వస్తాయి అది మనకి దుఃఖ హేతువు అవుతుంది. మన తలంపు మనకు బంధ హేతువు అవుతుంది. ఆ తలంపులే అలవాట్లుగా మారిపోయి ఆ తలంపులలో మనం కూరుకు పోతాము. మన తలంపు వేరు, జ్ఞాని తలంపు వేరు. జ్ఞాని తలంపు దేహ యాత్రకి సరిపడే నడుస్తూ ఉంటుంది. దేహానికి అంటే భోజనం చేయటమూ, మంచి నీళ్లుతాగటమూ, మనకి ఏవో నాలుగు మాటలు చెప్పటమూ, ఊరికే తలంపు దేహానికి సరిపడా ఉంటుంది. జ్ఞానికి, అజ్ఞానికి ఎంత దూర సంబంధమో అన్నారు చలం గారు. బాహ్యంగా చూస్తే మన లాగే కనిపిస్తాడు జ్ఞాని కూడా కాని అంతరంగంలోకి, ఆ



**మన మనస్సు ఎక్కువ చలిస్తూ ఉంటే,**
**భగవంతుడి మీద సజీవమైన విశ్వాసం**
**లేనట్లే. భగవంతుని మీద సజీవమైన**
**విశ్వాసం కుదిరితే,**
**మనస్సు యొక్క చలనం ఆగిపోతుంది.**

లోతుల్లోకి వెళ్లి చూసినప్పుడు జ్ఞానికి, అజ్ఞానికి ఎంత దూర సంబంధమో. మహమ్మద్ పెళ్లి చేసుకున్నాడు. యేసు క్రీస్తు పెళ్లి చేసుకోలేదు. యేసు క్రీస్తు పెళ్లి చేసుకోలేదు కాబట్టి యేసు క్రీస్తు ఎక్కువ వాడు కాదు. మహమ్మద్ పెళ్లి చేసుకున్నాడు కాబట్టి మహమ్మద్ తక్కువ వాడు కాదు. జ్ఞానం వచ్చాక అక్కడ సమానమే. కాని ఆ దేహ ప్రారబ్ధాన్ని బట్టి అది నడుస్తుంది. మనం బాహ్యంగా చూస్తాం. మనది చర్మ దృష్టి. గుజరాత్‌లో సెయింట్ అన్నాడు ఎవడికి అయితే చర్మ దృష్టి ఉందో, ఆ చర్మ దృష్టి ఉన్న వాళ్ళు అందరూ చెండాలులు అని చెప్పాడు. నేను నా దేహం కానప్పుడు మీరు మీ దేహం ఎలా అవుతారు? ఏమీ వైభవమో చూడండి. ఇందులో ఉన్న అందాలను మీరు చూడండి. నా దేహం నేను కానప్పుడు మీ దేహం మీరు ఎలా అవుతారు? ఈ దేహం నీది అని నీకు ఎవరు చెప్పక్కరలేదు. అలాగే జ్ఞానికి నేను ఆత్మ అని ఎవరు చెప్పక్కరలేదు. ఈ దేహం మీది అని మీరు భగవద్గీత చదివితే కాని తెలియదా, ఈ దేహం మీదే కదా, మీరు ఉపనిషత్తులు చదువుకోవాలా ఈ దేహం మీది అని తెలుసుకోవటం కోసం అక్కర్లేదు. ఈ దేహం నేను అని మీరు ఎంత సహజంగా అనుకుంటున్నారో జ్ఞాని నేను ఆత్మను అని అంత సహజంగా అనుకుంటాడు. మీకు దేహ బుద్ధి ఎప్పుడైతే పోయిందో ఉన్నది అదే వస్తువు. ఉన్నది ఒక్కటే. అదే ఆత్మ. ఒక్క వినయాన్ని మీరు ప్రాక్టీసు చెయ్యండి మీరు అందరూ జ్ఞానులు అయిపోతారు. నేను హృదయంలో ఉన్నాను అంటున్నారు. మరి నేను ఈ తలలో లేనా? అని భగవాన్‌ను అడుగుతున్నారు. ఈ తలలో కనుక నువ్వు ఉంటే, ఈ తలలో ఉన్న మాటే కనుక నిజం అయితే, రాత్రుళ్లు కూడా నీ తలకాయ వాలదు, అసలు నీకు నిద్రే రాదు.

ఎప్పుడైతే ఆత్మానుభవం కలిగిందో వాడి కళ్ళ లోంచి శాంతి కిరణాలు వస్తూ ఉంటాయి. వాడి body nervous system అంతా కూడా మంచి కూల్‌గా ఉంటుంది. ఎందుచేత అంటే అక్కడ emotion ఉండదు, devotion కాని. ఆత్మను చూడాలి అంటే ఆత్మను చూడటానికి, చూసేవాడు ఒకడు, చూడబడేది ఒకటి రెండు ఉన్నాయా? మీరు రెండుగా ఉన్నారా? ఒకటిగా ఉన్నారా? దుంప తెంచేస్తాడు , అడుగు అడుగుకి సమస్యే. మిమ్మల్ని ఎక్కడికి వెళ్ళనివ్వడు. మీ మనస్సుని శాస్త్రాలలో వెతక నివ్వడు. అడుగు అడుగుకు ప్రతీ మాటలో


మీ హృదయంలోకి ముంచేయటానికి ప్రయత్నం చేస్తాడు. బాహ్య ముఖానికి మిమ్మల్ని తిరగనివ్వడు. దేవుణ్ణి చూడాలి అది చూడాలి అని మీ మనస్సుని బాహ్యంలో పరుగెత్తుకుని వెళ్లనివ్వడు. దృశ్యం వైపుకి వెళ్లనివ్వడు. ఎందుకంటే ప్రతీ దృశ్యం అసత్యం అని ఆయనకు తెలుసు. మిమ్మల్ని ఆత్మలోకి ముంచి వేయటానికి ఎక్కడో శాస్త్రాల్లోకి మిమ్మల్ని పరుగెట్ట నివ్వడు. నేను ఆత్మను చూస్తాను, ఆత్మను చూస్తాను అని మీరు అంటున్నారు. ఆత్మను చూడాలంటే మీరు రెండుగా ఉండాలి. చూసేవాడు ఒకడు ఉండాలి, చూడబడేది ఒకటి ఉండాలి. మీరు రెండుగా ఉన్నారా? ఒకటిగా ఉన్నారా? ఏదైతే ఉందోదాన్ని గ్రహించటమే ఆత్మలో ఉండటం. చూడటం అనే సమస్య లేదు. అది అవ్వటానికి నువ్వు ప్రయత్నం చెయ్యి, జన్మ జన్మల నుండి, యుగ యుగాల నుండి బాహ్య దృష్టి మనకి అలవాటు అయిపోయింది అందుచేత దేవుడిని కూడా బాహ్యంగా చూడాలని మనం ప్రయత్నం చేస్తున్నాం. ఎప్పుడైతే వాడికి బాహ్య దృష్టి ఉందో, వాడు వేలాది జన్మలు ఎత్తినప్పటికీ, జ్ఞానం ఆ మనిషికి కలగదు. నీకు లోదృష్టి రానప్పుడు, లోచూపు రానప్పుడు, నీ మనస్సు అంతర్ముఖం కానప్పుడు, నువ్వు బాహ్య దృష్టిలో ఉన్నప్పుడు, నువ్వు దేవుణ్ణి చూడవచ్చు, ఏ రాముడినో, ఏ కృష్ణుడినో, ఏ అల్లానో, ఏ యేసునో నువ్వు బాహ్యంగా చూడవచ్చు. కాని నిన్ను అజ్ఞానం విడిచి పెట్టదు. నీకు బాహ్య దృష్టి ఉన్నంతకాలం నిన్ను బంధం విడిచి పెట్టదు. నువ్వు నేర్చుకోవలసింది లోపల దృష్టి. నీకు అంతర దృష్టి రావాలి. నీ అంతఃకరణాన్ని పరిశుద్ధం చేసుకోవాలి. నువ్వు జన్మ జన్మల నుండి బయటకి చూస్తున్నావు. ఈ బాహ్య చూపుకి అలవాటు పడిపోయావు. ఈ చూపు లోపలకి తిప్పకుండా, ఈ జన్మలోనే కాదు, మరు జన్మలోనే కాదు, ఏ జన్మలోను నీకు జ్ఞానం కలగదు. ఎంతసేపు దేవుడు ఏదో ఒక రూపంలో నాకు వచ్చి కనిపించాలి. అంటే మనకు బాహ్యదృష్టి అలవాటు పడిపోయింది కదా, చిన్నప్పటి నుంచి మనం తల్లి గర్భం నుండి బయటకి వచ్చింది మొదలు మళ్ళీ స్మశానంకు వెళ్ళే వరకు, మనకు బాహ్య దృష్టే. అందుచేత దేవుడు కూడా బాహ్యంగా వచ్చి మనకు కనిపిస్తే అది ఫైనల్ stage అని అక్కడి తోటి మన పని పూర్తి అయిపోయింది అని మనం అనుకుంటున్నాం.

మీకు దేవుడు కనిపించవచ్చు. ఆయన వరాలు నీకు ఇవ్వచ్చు. అవి నీవు అనుభవించవచ్చు. కాని నిన్ను బంధం విడిచి పెట్టదు. బాహ్యంగా నీకు దేవుడు కనిపించినంత మాత్రం చేత, నీకు దుఃఖం విడిచి పెట్టదు. అజ్ఞానం విడిచి పెట్టదు. పునర్జన్మ విడిచి పెట్టదు. నిన్ను బంధం వెంటాడుతూ ఉంటుంది. ఎప్పుడు? నీకు బాహ్య దృష్టి ఉన్నప్పుడు. అందుచేత నువ్వు లోపలకి చూడు, ఈ జన్మలోనే కాదు వేలాది జన్మల నుండి బయటకి చూడటానికి అలవాటు పడిపోయావు. అందుచేత నీ మనస్సుని లోపలకి తోలు. ఎవడైతే నీ మనస్సును అంతర్ముఖ పరచలేడో, వాడు గురువు కాదు, వాడు రాక్షసుడు. ఏదో ఒక నెపం పెట్టి నీ మనస్సును బయటకి తోలేవాడు అది యజ్ఞం అనో, యాగం అనో ఏదో వంక పెట్టి బయటకి నీ మనస్సుని, గడియ గడియకి మాట మాటకి బయటకి తోలుకు వెళ్ళే వాడు గురువు కాదు, వాడు రాక్షసుడు. ఆత్మను తెలుసుకోవడం చాలా సులభం అని భగవాన్ ఇలా చెబుతుంటే ఒక భక్తుడు అన్నాడు ఏమండీ భగవాన్, ఆత్మను గ్రహించడం అనేది చాలా తేలిక అని మీరు చెబుతున్నారు. ఆ తేలిక అనేది తెలిసున్న వారికా? తెలియని వారికా? అప్పుడు భగవాన్ ఏమీ అన్నారు అంటే, అది సరి తెలిసున్న వారికి. అంటే దాని యొక్క అస్తిత్వం దాని ఉనికి ఆ సూక్ష్మ బుద్ధి అనేది మీకు ఉంటేనే తేలిక. విచారణ ద్వారా, సూక్ష్మబుద్ధి తోటి ధ్యానం చెయ్యటం ద్వారా ఆత్మను తెలుసుకోవటం మానేసి, ఇతరత్రా గందరగోళ పద్ధతులు మీరు అవలంభిస్తే, వాటిని దొమ్మర విద్యలు అన్నారు. అవి ఆత్మ విద్యలు కాదు, దొమ్మర విద్యలు. ఇది భగవాన్ అనలేదు కాని భగవాన్ యొక్క గుండె కాయ పట్టుకుని దాని సారాన్ని నేను చెబుతున్నాను. దొమ్మర విద్య అని భగవాన్ అనలేదు. ఆయన పెద్ద మనిషి కాబట్టి అటువంటి మాటలు మాట్లాడరు. సర్వ సాధారణంగా పెద్ద మనుషుల్లో మంచి గుణాలు ఉంటాయి. అనవసరమైన మాటలు మాట్లాడరు. ఎదుటి వాడి హృదయానికి గాయం తగిలే మాటలు కూడా పెద్ద మనిషి మాట్లాడడు. భగవాన్ ఈ మాట నోటి తోటి చెప్పక పోయినప్పటికీ నాగరికత కోసం, సభ్యత కోసం, సంస్కారం కోసం, సూటిగా మీరు ఆత్మను తెలుసుకోకుండా, ఉన్న వస్తువును ఉన్నట్టుగా తెలుసుకోవడానికి

ప్రయత్నం చేయకుండా ఇతరత్రా గొడవల తోటి ఆత్మను తెలుసుకోవడం కోసం ప్రయత్నం చెయ్యడం దొమ్మర విద్యలు అవి. ఈ లోకానికి గొప్ప ఉపకారం చెయ్యాలని మీలో ఎవరికైనా ఉంటే, మీలో ఎవరికైనా సృష్టికి అంతటికీ గొప్ప ఉపకారం చెయ్యాలి అని ఉంది అనుకోండి, మీరు జ్ఞానం సంపాదించండి. మీ ద్వారా సృష్టి పులకిస్తుంది. మీ ద్వారా లోకం అంతా కూడా పులకిస్తుంది. భూమి అంతా పులకిస్తుంది. జ్ఞాని ద్వారా లోకానికి ఎంత ఉపకారం జరుగుతుందో కూడా ఈ లోకానికి తెలియదు. అటువంటి మహత్తరమైనటువంటి సహాయం జ్ఞాని యొక్క హృదయం నుండి ప్రవహిస్తూ సృష్టిని ముంచేస్తుంది. ఈ సృష్టికి ఉపకారం చెయ్యాలి అని మీరు అనుకుంటే, మీ కరుణతో మీ ప్రేమతో ఈ సృష్టిని తడపాలి అని మీరు అనుకుంటే, మీరు ఆత్మ జ్ఞానాన్ని సంపాదించండి, ఆత్మానుభవాన్ని పొందండి, ఆత్మ సాక్షాత్కారాన్ని పొందండి. అప్పుడు ఎవరి ద్వారా జరగనటువంటి మహోన్నతమైనటువంటి ఉపకారం మీ ద్వారా ఈ లోకానికి జరుగుతుంది. ఈ లోకానికి అంతా కళ్యాణం కలుగుతుంది. ఎప్పుడు? మీకు జ్ఞానం కలిగితే మీ ద్వారా ఈ లోకానికి కళ్యాణ స్థితి కలుగుతుంది. ఒక జ్ఞాని ద్వారా ఈ లోకానికి జరిగే ఉపకారం ఇంక ఎవరి ద్వారా జరగదు. అందుచేత మీరు జ్ఞానాన్ని సంపాదించండి. ఈ సృష్టి మిమ్మల్ని చూసి పులకిస్తుంది. సృష్టి శాంతి పడుతుంది. సుఖ సంతోషాలతోటి ఊగిసలాడుతుంది.

**మనో మౌనంలో నుండి**
**వచ్చే శక్తి లోకమునకు అంతా**
**ఉపయోగపడుతుంది.**
**మౌనం వలన**
**మీలో వచ్చే మార్పు మాటలకు అందదు.**
**ఏ జ్ఞాని అయినా, మహాత్ముడు అయినా**
**మౌనంలోనే పని చేస్తాడు.**





# అరుణాచల మహత్మ్యం
# అక్షరమణమాల

**పేరు దలపగనే పట్టి లాగితివి నీ**

**మహిమ కనుదురెవరు అరుణాచలా ॥70॥**

**తాత్పర్యము :** 'అరుణాచలా' అని నిన్ను స్మరించినంత మాత్రము చేతనే, నన్ను అహంకారములో నుంచి బయటికి లాగివేశావు కదా! నీ మహిమ 'ఇట్టిది' అని ఎవరికి తెలుస్తుంది అరుణాచలా?

అరుణాచలా అని నిన్ను స్మరించిన వెంటనే ఈ దేహం నాది అనే బుద్ధిని తీసేశావు. నా దేహాన్ని నాది కాకుండా, నా మనస్సుని నాది కాకుండా చేస్తావని నేను అనుకోలేదు. నేను ఏమీ పుణ్యాలు చేయలేదు, యజ్ఞాలు యాగాలు చేయలేదు, అరుణాచలం అన్నాను అంతే. ప్రకృతి విషయాలతోటి కొట్టుకుపోతున్న నన్ను, లోకవాసనల తోటి కొట్టుకుపోతున్న నన్ను, అజ్ఞానంతో బంధంతో కొట్టుకుపోతున్న నన్ను అనుగ్రహించి నా దేహబుద్ధిని తీసేశావు, ఆత్మబుద్ధిని కలుగజేశావు అంటున్నారు రమణమహర్షిగారు.

నేను పుణ్యాలు చేయలేదు, పూజలు జపాలు ధ్యానాలు చేయలేదు, యజ్ఞాలు చేయలేదు, నోములు వ్రతాలు ఏమీ చేయలేదు. యాత్రలు అసలే చేయలేదు. నేను ప్రత్యేకించి భక్తి కోసం ఏమీ చేయలేదు. భక్తులకి ఉండాల్సిన లక్షణాలు నాదగ్గర ఏమీ లేవు. నన్ను అనుగ్రహించావేమిటి - లోకంలో ఇంకా చాలామంది ఉన్నారు కదా. నా కొంపలో నేను గౌరవంగా బ్రతుకుతా ఉంటే బయటికి లాగేసావేమిటి. ఈ గౌరవాలు అగౌరవాలు, లాభాలు, నష్టాలు, ఈ చావులు పుట్టుకలూ, ఈ దేహగతమైన నేను మనోగతమైన నేనుకే. నేను కాని దానిని నేను అని నమ్మి సుఖంగా బ్రతుకుతున్నాను. ఇప్పుడు నాకొంప అంతా పడగొట్టేశావు. నా ఇంటిలో నన్ను ఉండనివ్వకుండా బయటికి లాగేసావు. ఏ నేను అయితే

నాకు ఇష్టమో, ఆ నేనును నాకు కాకుండా చేసేశావు.

మామూలుగా జీవుడికి శరీరం నేను అనే బుద్ధి ఉంటుంది కదా. మనందరికీ నేను అంటే ఇష్టం. మీ భర్త అంటే మీకు ఇష్టం అని మీరు అనుకుంటారు పొరపాటు అది. మీకు నేను అంటేనే బాగా ఇష్టం. మీకు నేను అంటే బాగా ఇష్టం కాబట్టి, మీ నేనుకి ఆయన భర్త కాబట్టి, ఆయన అంటే ఇష్టం. ఈ నేను అంటే మీకు ఇష్టం కాబట్టి ఆ నేనుని ఇష్టపడుతున్నావు. ఈ నేను అంటే నీకు ఇష్టం లేకపోతే ఆ నేనుని కూడా నువ్వు ఇష్టపడవు.

అరుణాచలేశ్వరుడిని స్మరించటం వల్ల దేహబుద్ధి పోయింది. దేహగతమైన నేనుని తీసేసి నిజమైన నేనుని ప్రసాదించావు అంటున్నారు. అది యూనివర్సల్! అంటే ఏదైతే నేను నేను అనుకొంటున్నానో, ఆ ఇండివిజ్యువల్ ఐని, తీసేసి నాకు కాకుండా చేసేశావు. దేహబుద్ధిని తీసివేయటం ఆత్మబుద్ధిని కలగజేయటం ఒకేసారి చేసేశావు. ఇదంతా ఆటోమేటిక్ డివైన్ యాక్షన్. ఇందులో సాధన ఏమీ లేదు, ఇండివిడ్యువల్ ఐ కి పరిమితులు ఉంటాయి, ఇండివిడ్యువల్ ఐ పోయినప్పుడు పరిమితులు కూడా పోతాయి, హద్దులు పోతాయి, దేశకాలాలు పోతాయి, పునర్జన్మలు పోతాయి, అప్పుడు యూనివర్సల్ అయిపోతాడు. వాడు కళ్ల తోటి ప్రపంచాన్ని చూసినా చూడనివాడితోటి సమానం. వాడి మనస్సులో లోకవాసన ఉండదు. ప్రపంచం కనిపించినా కానీ ఏదీ వాడిని బంధించదు. అక్కడ బంధింపబడే నేను లేదు. ప్రపంచంలో ఉంటాడు కానీ ప్రపంచం వాడిలో భాగంగా ఉండదు.

నేను జపాలు చేశానా, ధ్యానాలు చేశానా? ఊరికే 'అరుణాచలా' అన్నాను అంతే. నీ చేత ఆకర్షింపబడ్డాను. నీ పేరు తలపగానే నాలో ఉన్న ఎందుకూ పనికిరాని స్టుపిడ్ స్టఫ్ (Stupid Stuff) నువ్వు పుచ్చుకొని, నీ హృదయాన్ని నాకు ఇచ్చావు. నా పని పూర్తి చేసేశావు. నీ కరుణను ఎవరు తెలుసుకోగలరు అరుణాచలా! ఊరికే ఒకసారి అరుణాచలం అని స్మరించాను అంతే, ఎంతో గొప్ప లిఫ్ట్ ఇచ్చావు. ప్రకృతి గొడవలలో నుంచి బయటకు లాగి, నీ హృదయంలోనికి తీసుకొన్నావు. అటువంటి అరుణాచలం యొక్క ఔన్నత్యం ఇట్టిది అని చెప్పగలిగిన వారు ఎవరున్నారు? నీ ఔన్నత్యం గురించి, నీ మహిమ గురించి నేను చెప్పగలనా? నేను సరిపోతానా? జ్ఞానం కంటే, మోక్షం కంటే మించిన మహిమ ఇంకోటి ఉందా?



# శ్రీమద్భగవద్గీత

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)**

**బ్రహ్మభూతః ప్రసన్నాత్మా న శోచతి న కాంక్షతి ।**
**సమః సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్ ॥18-54॥**

**తాత్పర్యము:** సచ్చిదానంద ఘన బ్రహ్మయందు ఏకీభావస్థితుడై ప్రసన్నమనస్కుడైన యోగి దేనికిని శోకింపడు, దేనినీ కాంక్షింపడు. సమస్త ప్రాణులయందును సమభావము గల అట్టి యోగి నా పరాభక్తిని పొందును.

బ్రహ్మభూతః - అంటే నువ్వు దేహంగా ఉండకు మనస్సుగా ఉండకు. బ్రహ్మముతోటి ఏకత్వం సంపాదించు. శాంతి చిత్తం అంటే ప్రశాంతమైన మనస్సుని సంపాదించు. అనుకూలమైన భార్య దొరికిన వాడి కంటే, నచ్చిన ఉద్యోగం దొరికిన వాడికంటే, శాంత చిత్తము కలవాడు అదృష్టవంతుడు. మిమ్మల్ని ఎవరైనా ఇబ్బందులు పెడితే వాళ్లమీద ఏదో కోపం వచ్చేస్తుంది చిరాకు వచ్చేస్తుంది. తుకారాం భార్యవల్ల చాలా కష్టాలు పడ్డాడు. జీవితం పొడుగునా హింసలుపెట్టినటువంటి భార్యని దుర్మార్గురాలిగా ఎప్పుడూ చూడలేదు, భార్య మీద వికారం రాలేదు. అంత నిర్వికారుడు! ఆయనని తీసుకెళ్లటానికి వైకుంఠం నుంచి విమానం వచ్చింది. అలా ఏ మహాత్ముడికీ రాలేదు మన చరిత్రలో, అంత పవిత్రుడు ఆయన. భార్యని నువ్వు కూడా నాతోపాటు వైకుంఠానికిరా అంటాడు. కానీ అంతర్యామిగా ఉన్న భగవంతుడు ఆవిడని రానివ్వలేదు, వైకుంఠం అంటే శాశ్వతమైనలోకం అని అర్థం అవ్వనివ్వలేదు. తుకారాం అన్నాడు, పాండురంగడి పట్ల నాకున్న భక్తిలో, పాండురంగడికి నేను చేసినటువంటి శరణాగతిలో, ఈ దేహగతమైన నేను మనోగతమైన నేను, ఎప్పుడు పోయిందో నాకు తెలియదు. పోయిన తరువాత తెలిసింది పోయిందని. ఈ నేనుని

పోగొట్టుకోవాలని నేనెపుడూ అనుకోలేదు. దేహబుద్ధి పోవటం ఆత్మబుద్ధి రావటం ఇవన్నీ ఆ శరణాగతి భావంలో ఆటోమేటిక్‌గా జరిగిపోయినవి అన్నాడు.

నువ్వు మాట మాటకి ఉద్రేకపడవద్దు. మనస్సుని ఇంద్రియాలని ఉద్రేకపరిచే పనులు చెయ్యొద్దు అంటాడు బుద్ధుడు. అంటే నీ బుద్ధిలో ఉన్న వివేకం, తెలివి పోకూడదు. ఎంతవరకు ఉద్రేకపడుతున్నారో అంతవరకు మీకు ఆలోచన, తెలివితేటలు తగ్గిపోతాయి. మీరు బుద్ధిబలం సంపాదించుకోవాలి, వివేకం పెంచుకోవాలి. ఇది నిత్యం ఇది అనిత్యం, ఇది మంచి, ఇది చెడ్డ, ఇది మనకి ఉపయోగపడుతుంది ఇది ఉపయోగపడదు, అనే జడ్డిమెంట్ మీకు కరెక్టుగా ఉండాలి. మీ ఇంద్రియాలు మీ మనస్సు ఉద్రేకపడుతూ ఉంటే మీరు లోపల ఉన్న స్వరూపానికి దూరం అవుతారు.

ప్రసన్నాత్మా - అంటే శాంతచిత్తం కలవాడు, చల్లగా ఉండే మనస్సు కలవాడు, నిశ్శబ్ధంగా ఉండే మనస్సు కలవాడు అందరికీ తల్లులు ఉన్నారు. దేవుడి తల్లి మౌనం. లోపల ఉన్న సద్వస్తువు మీకు అనుభవంలోకి వచ్చినప్పుడు, మీకు ఎటువంటి సైలెన్స్ వస్తుందో అది దేవుడి యొక్కతల్లి. మీ హృదయంలో ఆ సైలెన్స్ అనుభవించేటప్పుడు, ఆ ఆనందం మీకు అనుభవంలో ఉన్నప్పుడు, దేవుడి మాటలు కూడా మీకు వినాలనిపించదు. ఇష్టం లేక కాదు, అవసరం లేక, మీకు దాహం వేయటంలేదు అనుకోండి, మంచినీళ్లు అడిగితే వద్దంటారు. ఇష్టం లేక కాదు, దాహం లేదు కాబట్టి వద్దు అంటారు. అలాగే భగవంతుడి తాలూకు మౌనం మనం అనుభవిస్తున్నప్పుడు, దేవుడి మాటలు ఎంత సౌందర్యంగా, వండర్ఫుల్‌గా ఉన్నప్పటికీ, ఇక్కడ అనుభవించే ఆనందం ముందు అది వినాలని మీకు అనిపించదు. అది దేవుడి తల్లి. సైలెన్స్ ఈజ్ ది మదర్ ఆఫ్ గాడ్!

బ్రహ్మభూతః ప్రసన్నాత్మా - శాంతచిత్తం ఉండి, మనస్సు అణిగిన వాడికి కానీ ఆత్మజ్ఞానం కలగదు. మనస్సు అణగటానికి కూడా సత్పురుష - సజ్జన సాంగత్యం ఉండాలి. తరువాత మీరు ఎంతోకొంత సాధన చెయ్యాలి. ఈశ్వరుడి తాలూకు స్మరణ ఉండాలి. మంచి మాటలు వినాలి. మంచి దృశ్యాలు చూడాలి. బుద్ధిసూక్ష్మత పెంచుకోవాలి. ఇప్పుడు మీ శరీరంతోటి, మనస్సుతోటి, ఇష్టాఅయిష్టాలతోటి, ఎలాగైతే ఏకీభావం పొందుతున్నారో, అలాగే మీకు శాంతచిత్తం లభ్యం అయినప్పుడు, లోపల ఉన్న బ్రహ్మముతోటి ఏకీభావన పొందినప్పుడు, ఇంక కోరిక లేదు, దుఃఖము లేదు.

న శోచతి న కాంక్షతి - కోరికలు లేనివాడికి పునర్జన్మలు లేవు. మీరు స్వార్ధంతోటి ఏ పని చేసినా పునర్జన్మలు తీసుకొస్తుంది. నిరంతరమూ శాంతిలో సుఖములో ఊగిసలాడే మనిషికి దుఃఖము ఎక్కడ వస్తుంది, కోరికలతోటి పనేముంది! మనకి లోపల వెలితి ఉన్న

మూలానే కోరికలు వస్తాయి. లోపల వెలితి లేకపోతే మనకి కోరికలు రావు. మీకు ఆత్మవిశ్వాసం లేకపోతే వాళ్లచేత గౌరవింపబడాలి వీళ్లచేత గౌరవింపబడాలి అంటారు. మన మీద మనకి విశ్వాసం ఉన్నప్పుడు ఇతరుల గౌరవంతోటి మనకి పనేముంది. వాళ్ళు గౌరవించటం వల్ల లాభం లేదు, అగౌరవపరచటం వల్ల నష్టం లేదు. అసలు ప్రపంచమే నిజం కాదని మీకు అనుభవంలోకి వచ్చినపుడు గౌరవం ఏంటి అగౌరవం ఏంటి వాడికి.

శాంతచిత్తం కలవాడికి కోరిక ఏమిటి దుఃఖం ఏమిటి? సూర్యుడు ఎప్పుడైనా చీకటిని చూద్దామని వెదికినా, సూర్యుడికి చీకటి కనపడదు. అలాగే శాంతమానసం కలవాడికి, ఎక్కడికి వెళ్లినా దుఃఖం కనపడదు. ఎక్కడికి వెళ్లినా ఆనందమే. ఎటుచూసినా శాంతే ఎటుచూసినా సుఖమే. బ్రాహ్మీస్థితి పొందిన వాడికి లోకాలు, ప్రయాణాలు అవసరం లేదు. అందుచేత కృష్ణుడు నువ్వు స్వర్గలోకానికి వెళ్ళు వైకుంఠానికి వెళ్ళు ఇటువంటి మాటలు చెప్పలేదు. అర్జునా, నువ్వు బ్రాహ్మీస్థితిని పొందటానికి ప్రయత్నం చెయ్యి. అది ఉత్తమోత్తమ స్థితి. ఆ బ్రాహ్మీస్థితి వల్ల వచ్చే సుఖంతోటి సమానమైన సుఖం కానీ, దానికంటే మించిన సుఖం గాని ఏమీ లేదు అని చెప్పాడు.

సమః సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్ - సర్వేషు భూతేషు, అంటే నీవు జీవకోటిపట్ల సమానభావం కలిగి ఉండాలి. అంటే రాగద్వేషాలు ఉండకూడదు. మీకెక్కడా ఇష్టం లేదు అనుకోండి, ఎక్కడా అయిష్టం కూడా లేదనుకోండి మీ మనస్సు ఎక్కడికైనా వెళ్తుందేమో చూడండి. మీరలా కూర్చోండి, మీరు సాధన చేయొద్దు. ప్రశాంతంగా కూర్చోండి. మీకు లోకంలో సృష్టిలో ఎక్కడా ఇష్టం అయిష్టం కూడా లేదనుకోండి మీ మనస్సుని కదలమన్నా కదలదు. ఎవరింటికెళ్ళి చూసినా ఏ దేశమెళ్ళి చూసినా ఏముంది ఈ లోకంలో ఇష్టాలు అయిష్టాలు తప్పించి. ఒక ఇంటిలో పదిమంది ఉంటే పది పార్టీలు. ఇష్టాయిష్టాలు పెంచుకుంటే మీకు మనస్సు పాడవుతుంది. మనస్సు మురికి చేసుకోకండి. ఇష్టాయిష్టాల వల్లే మనస్సు మురికి అవుతుంది. అందుచేత మీకు ఇష్టాయిష్టాలు లేకపోతే, మీ మనస్సులో హెచ్చుతగ్గులు లేకుండా ఉంటే మీకు సమాన బుద్ధి కలిగితే, అప్పుడు నాపట్ల మీకు భక్తి కలుగుతుంది. అప్పుడు నాపట్ల మీకు విశ్వాసం కుదురుతుంది అంటున్నాడు పరమాత్మ.

భగవంతుడికి సంబంధించిన కథలు వినాలి. ఆయనకి సంబంధించినటువంటి చరిత్రలు చదవాలి. మన అహంకారాన్ని మన మనస్సును ఒక పక్కన పెట్టేసి ఆయన చెప్పిన మాటలు వింటూ ఉండాలి. అలా శ్రవణం చేయగా చేయగా ఆయన పట్ల మనకి భక్తి కలుగుతుంది. విశ్వాసం కలుగుతుంది. ఆ విశ్వాసమే ఆయన హృదయంలోకి మనల్ని తీసుకెళ్తుంది.

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**

**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**

IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# సద్గురు జయంతి

దిll 23-09-1934న శరీరము ధరించి, దిll 29-12-2017న మహానిర్వాణం చెందే వరకు, మన మధ్యే అతిసామాన్యుని వలె సంచరించిన ఆదర్శమూర్తి, మహాపురుషుడు, సద్గురువు శ్రీనాన్నగారు. భగవాన్ శ్రీరమణమహర్షిచే ఎన్నుకోబడిన శ్రీనాన్నగారు తమ జీవిత కాలంలో అనేక ప్రాంతాలను సందర్శించి, 'అమృత సందేశాన్ని' అందించారు. అంతర సౌందర్యము కలిగిన శ్రీనాన్నగారు, సర్వులకు ప్రేమపాత్రులైనారు. సద్గురు శ్రీనాన్నగారు నిరాడంబరంగా, పరమార్థము కొరకే తన జీవితమును అంకితము చేసి, తమ జీవితము ద్వారా, బోధ ద్వారా, అనేక ఉపమానాల ద్వారా, తత్త్వ బోధను సులభముగా మన మనస్సుకి హత్తుకునే విధముగా వివరించేవారు. దేహాత్మబుద్ధి కారణంగా దుఃఖము, అశాంతి, జన్మపరంపరలకు లోనై అలమటించే మానవునికి వాస్తవంగా తానెవరో తెలియజెప్పి, అంతరంగ స్వరూపంగా భాసిస్తున్న స్వస్థితిలోకి మేల్కొనునట్లు చేయునదే నిజమైన విద్య. అట్టి 'ఆత్మ విద్య'ను మనకు బోధించారు. మనము ఏవిధమైన సాధన చేసినప్పటికీ, అది స్వస్వరూపానుభూతికి సహకరించాలి. అంతర్యామిని దర్శించాలంటే, జ్ఞాననేత్రం కావాలి. ఒక పనిని నేను చేసాను అంటే, అది నేను చేసానా? నా ద్వారా పరమాత్మ చేసాడా? అన్నది గ్రహించాలి. సత్ప్రవర్తన, నిష్కపటము, వినయము, నమ్రతతో జీవించాలి. కపటబుద్ధి, పక్షపాతము కూడదు అని తరచూ చెప్పేవారు నాన్నగారు. శ్రీ రమణతత్త్వ సారాన్ని దైనందిన జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలతో సమన్వయించి, భక్తుల హృదయాలలో సహజంగా తాకేలా బోధించేవారు. శ్రీరమణతత్త్వావగాహనకై సద్గురు శ్రీనాన్నగారు మనకు అందించిన 'రమణవాణి' అమూల్యం, అద్వితీయం. తత్త్వసారాన్ని అందించుటలో దిట్ట శ్రీనాన్నగారు. గురువుతో మనకి ఉన్న సంబంధం శాశ్వతం, మిగిలినవి మాయాసంబంధాలు. ఈ మానవ జీవితాన్ని ప్రసాదించిన పరమాత్మ మనకు విచక్షణా శక్తిని కూడా ప్రసాదించాడు. అట్టి విచక్షణా శక్తిని నూటికి నూరుపాళ్ళు ఉపయోగించుకోవాలన్నదే శ్రీనాన్నగారి సందేశం. అహంకారం లేకుండా జీవించడమే గొప్ప తపస్సుగా పేర్కొన్నారు. జిన్నూరు శ్రీరమణక్షేత్రము మూల కేంద్రముగా దేశ, విదేశాలలోని లక్షలాది జిజ్ఞాసువులకు శ్రీరమణ తత్త్వాన్ని అందించిన గురుదేవులు, పరమ పూజ్యులు, సద్గురు శ్రీనాన్నగారి పాద పద్మములకు నమస్కరిస్తూ....

**(దిll 23-09-2022 సద్గురు శ్రీ నాన్నగారి జయంతి సందర్భముగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

## పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం అర్ధవరం గ్రామంలో వెలసిన దివ్యక్షేత్రాల సందర్శనం

కూనపరాజు సీతమ్మగారు భర్త సూర్యనారాయణరాజు దంపతులు అంటే విశాఖపట్నం సుజాత అమ్మమ్మ తాతగార్లు మా గ్రామానికి ప్రారంభంలో 400 గజాలు స్థలం కొని శ్రీరమణక్షేత్రాన్ని నిర్మించారు. ప్రస్తుత నిర్వహణ భారాన్ని కళ్ళేపల్లి రామాలు గారు చూస్తున్నారు. భగవాన్ రమణమహర్షి సూచనలు, సలహాలతో కొత్తగా అంటే పాత మందిరానికి సమీపంలో మరో క్రొత్త మందిరం నిర్మాణానికి రామాలుగారిని ఆదేశించారు. ఆ మందిర నిర్మాణానికి పునాదిలో బంగారం, ముత్యం, రాగి వగైరాలు వెయ్యటంలో భగవాన్ ప్రక్కనే ఉన్న ఒక కంసాలివానికి స్వప్నంలో కనిపించి ఉదయం 6 గంటల ముహూర్తానికి అవి పట్టుకొనివెళ్ళు అనగా సంభ్రమాశ్చర్యాలతో ఆ సమయానికి పట్టుకొని వెళ్ళి సమర్పించుకొన్నాడు. ఆ కొత్త భవనం నిర్మాణమైనది. ఆ భవనానికి పెద్ద శివలింగం నిర్మించు అనగా భగవాన్‌తో రామాలుగారు డబ్బు ఎక్కడ నుంచి సంపాదించాలి అనగా 'అదే వస్తుందిలే' అన్నారు. ఈ గ్రామవాసి డాక్టర్ గారి బాబు ఆ నిర్మాణ స్థలాన్ని చూసి 50వేల రూపాయలు సమర్పించారు. ఆయనే మా గ్రామంలో పార్వతీ మల్లేశ్వరస్వామి ఆలయం వెనుక భాగాన ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తి పీఠాలు మార్బుల్ రాతితో వాటి విశేషాలను పొందుపరిచారు. శ్రీరమణక్షేత్రంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, వినాయక స్వామి, పాముల పుట్టలో పాములు సజీవంగా ఉన్నట్లు చూపరులను విశేషంగా ఆకర్షించటంతో ఆశ్రమం శోభాయమానంగా విరాజిల్లుతోంది. ప్రక్కనే ఉన్న చెరువులో ఉత్సవ సమయంలో తెప్పోత్సవం, చెరువుకు అవతల స్మశానం పెద్ద శివుని ధ్యానంలో నిమగ్నమై ఉన్న విగ్రహం ఉంది. సమీపంలో ఉన్న దుర్గా మాత ఆలయం, మరో దేవత ఆలయంలోను ఆశ్రమంలోను కలిపి కోటి దీపోత్సవం జరుగుతుంది. కొత్త మందిర నిర్మాణం పై భాగాన అరుణాచల జ్యోతి ప్రజ్వరిల్లచేయటంలో 400 మంది భక్తులు అక్షరమణమాల పారాయణంతో ఆశ్రమం మారుమోగుతుంది. శ్రీనాన్నగారు 1976లో ఈ ఆశ్రమాన్ని దర్శించి ఆనందించారు. ఆ సమయంలో వారు ఇలా అన్నారు "జిన్నూరు కన్నా భగవాన్ ఇక్కడికే ముందు ఏతెంచారు" అని.

200 సు॥ల పూర్వం నూజివీడు జమీందార్లు పార్వతీ మల్లేశ్వర స్వామి ఆలయాన్ని గ్రామ మధ్యలో ఇనుము, కాంక్రీటు లేకుండా ఘనంగా నిర్మించారు. ఈ గుడికి పూర్వం అయిలూరి రామశాస్త్రిగారు అర్చకస్వాములుగా ఉండేవారు. వారు రమణభక్తులుగా సిద్ధపురుషులు. ఈ ఆలయానికి ముందు పెద్ద పెంకుటి సావిడి ఉండేది. ఆధ్యాత్మిక సాధువులు ఉచితంగా వేదం చెప్పి వారి వసతికి భోజనానికి ఏర్పాట్లు చేసేవారు. ఆంధ్ర రాష్ట్రంలో మిరాసీదార్లకు దేవస్థానాలలో కొంతభూమిపై కొంత హక్కు కల్పించి వారి భక్తికి హక్కు కలిగించటానికి హైకోర్టులో వేద ప్రమాణాలకు ఉదహరించి ఘన విజయం సాధించారు. శాశ్వత కీర్తిని సంపాదించారు. బులుసు సాంబమూర్తివంటి ఎందరో మహానుభావులు ఆధ్యాత్మిక సంపన్నులు వారిని సందర్శించుకొని సందేహాలు తీర్చుకొని ఆనందంగా వెళ్ళేవారు. లేఖల ద్వారా వచ్చే సాధకులకు రమణమహర్షి, రామకృష్ణుల బోధల నుండి విషయాన్ని తెలిపి లేఖలు తిరిగి పంపేవారు.

**(వచ్చే సంచికలో మిగిలిన విశేషాలు తెలుపుతాను) - సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**